J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 26 02.12.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## రాజశేఖరరెడ్డి కుటుంబానికి



# ఇక్కడ రాజపూజ్యం అక్కడ అవమానం





## సఖ్యత లేని జగన్, కేసీఆర్‌ల స్నేహం

### ఒకరు కమలప్రియులు.. మరొకరు కలహప్రియులు

అదంతా ఒకే కుటుంబం. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుటుంబం. ఒకరు ఆయన భార్య, ఇంకొకరు కొడుకు, మరొకరు కుమార్తె. రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం తరువాత భార్య విజయమ్మ, కొడుకు జగన్‌మోహన్ రెడ్డి, కూతురు షర్మిల వీధులలోకి వచ్చారు. సోనియమ్మ నాయకత్వంలోని కాంగ్రెస్ అధిష్టానం తమకు చేసిన అన్యాయాన్ని వివరించారు. మహానేత కుటుంబసభ్యులను చూసి రెండురాష్ట్రాల తెలుగు ప్రజలు చలించారు, మంగళహారతులతో స్వాగతం పలికారు. తమ కుటుంబంగా చేరదీసి ఆదరించి అక్కున చేర్చుకున్నారు. 2014 నాటికి రాష్ట్రం విడిపోవడంతో, అనాథలుగా మిగిలి అయోమయంలో ఉన్న ఆంధ్రులు ఆనాటి ఎన్నికలలో బాబుకి పట్టంకట్టారు. ఆ తరువాత 2019లో వైసీపీకి 151 సీట్లతో అధికారం కట్టబెట్టి ముఖ్యమంత్రి కుర్చీని రాజశేఖరుడి వారసుడు జగన్‌మోహన్‌రెడ్డికి అప్పజెప్పారు. ఇది ఒక అధ్యాయం.

పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే అన్నకి చెల్లి దూరమయ్యింది. చెల్లికి బాసటగా తల్లి కూడా తోడయ్యింది. షర్మిల రాజకీయ భవిష్యత్‌కి తెలంగాణ వేదికయ్యింది. ఫలితంగా వై.ఎస్.ఆర్.టి.పి ఆవిష్కృతమయ్యింది. నాన్న రాజకీయ ప్రస్థానాన్ని అతి దగ్గరగా చూస్తూ పెరిగిన షర్మిల పొలిటికల్ ప్రయాణం ఆయన బాటలోనే మొదలయ్యింది. తెలంగాణలో అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర పార్టీపై తిరుగుబాటు బావుటా ఎగురవేయడంతో షర్మిల చరిష్మా గల నాయకురాలయ్యింది. ఇదీ మరో అధ్యాయం.

ఇక నడుస్తున్న చరిత్రలోకి వెళ్తే... తెలంగాణలో చిత్ర విచిత్ర రాజకీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నాన్న చేపట్టిన ప్రజాప్రస్థానం స్ఫూర్తితో అదే పేరుతో షర్మిల తెలంగాణలో పాదయాత్ర చేపట్టింది. అందరి యాత్రలకు జనం వచ్చినట్లే ఆమె యాత్రకు కూడా అసాధారణ స్థాయిలో జనం వస్తున్నారు. పదునైన పదజాలంతో తనదైన బాణీలో ప్రతి సభలోనూ ఆమె కేసీఆర్‌ని నేరుగా విమర్శించడం ఆమె యాత్రలో ఆకర్షణీయంగా మారింది. ఇక్కడే కేసీఆర్ అనుచర గణానికి కోపం వచ్చినట్లుంది. డిసెంబర్ 27వతేది ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో ఆమెపై దాడి చేశారు. ఆమె బస చేసే వాహనంపై పెట్రోలు పోసి తగలబెట్టారు. శాంతి భద్రతల పేరుతో షర్మిలను పోలీసులు బలవంతంగా హైదరాబాదుకి తరలించే పరిస్థితిని కల్పించారు. ఆదివారం రాత్రికి హైదరాబాదులోని

10లో

## శ్రద్ధాంజలి




అమ్మా...

నిష్కల్మషమైన ప్రేమను పంచిన స్వచ్ఛమైన మనసు మీది..
అడిగినవారికి లేదనకుండా సాయంచేసిన సహృదయం మీది.

మా జీవితాలలో వెలుగులు నింపిన అనురాగమూర్తి మీరు..
మాలో సేవాస్ఫూర్తిని వెలిగించిన ఆత్మీయదీప్తి మీరు.

**శ్రీమతి బోగొల్లు పిచ్చమ్మ గారు**

24.11.2022, గురువారం ఉదయం పరమపదించినారు.

ఆ పుణ్యమూర్తి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు

**డాక్టర్ బోగొల్లు ప్రభాకర్‌రెడ్డి - డాక్టర్ సరోజిని**
నెల్లూరు

**బోగొల్లు మోహన్‌రెడ్డి - నిర్మలమోహన్**
మోహన్ అసోసియేట్స్, హైదరాబాదు

మనుమళ్ళు - మనుమరాళ్ళు

**బోగొల్లు సతీష్ - స్వప్న** **బోగొల్లు సత్యనాథ్ - సృజన**
**బోగొల్లు ఉదీప్ - అనిత** **బోగొల్లు సందీప్ - సరిత**

మరియు **మునిమనుమళ్ళు, మునిమనుమరాళ్ళు**

**ఉత్తరక్రియలు : 08.12.2022** గురువారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరు, దర్గామిట్టలోని రెవెన్యూ కాలనీ, 2వ వీధి (రాజరాజేశ్వరి గుడి ఎదురుగా)లోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# రజకులకు రక్షణ ఏదీ

## • సంఘం నాయకుల ఆవేదన

రజకులకు రాష్ట్రంలో రక్షణ కరువైందని, రజకులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, గ్రామబహిష్కరణలు వంటి వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠినచట్టాలను తీసుకురావాలని రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నవంబరు 27న నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానభవన్‌లో జరిగిన ఆ సంఘం ఆత్మీయ సదస్సులో నాయకులు మాట్లాడుతూ రజకులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ఎస్సీఎస్టీ అట్రాసిటీస్ యాక్ట్ లాంటి చట్టాలను అమలులోకి తేవాలని కోరారు. అదేవిధంగా రజకుల అభ్యున్నతికి అవసరమైన నిధులను కేటాయించి, యువతకు స్కిల్‌డెవలప్‌మెంట్ విభాగం ద్వారా శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కలిగించాలన్నారు. రజకుల సమస్యల పరిష్కారం కోసం రజకులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య, నాయకులు డాక్టర్ తిరుపాల్ తదితరులు మాట్లాడారు. నాయకులు పాతపాటి రాధాకృష్ణ, గంధం అంకయ్య, ఆములూరు వెంకటేశ్వర్లు, కటికాల వెంకటేశ్వర్లు, దేవరకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



### కొత్త కార్యవర్గం

ఈ సదస్సు సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం జిల్లా శాఖకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షునిగా పొట్టేపాళెం చంద్రమౌళి, అధ్యక్షునిగా నేరెళ్ళ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.అంకయ్య, ఉపాధ్యక్షులుగా పి.సురేంద్ర, బ్రహ్మదేవి వేదవతమ్మ, సహాయ కార్యదర్శిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుగా వెంకటేశ్వర్లు, మరో 19 మంది సభ్యులు ఎంపికయ్యారు.

# మహిళలపై వేధింపులను అరికట్టాలి



మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులను పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్ అధికారులను ఆదేశించారు. అందుకు అధికారులు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని ఆయన సూచించారు. నవంబరు 28న కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మహిళలు, బాలల సంరక్షణకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నవంబరు 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమాల్లో సంబంధిత అధికారులందరూ క్షేత్రస్థాయిలో పాల్గొని మహిళలకు జాగ్రత్తలు సూచిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరగకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం మహిళలు, బాలల సంరక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న భేటీ బచావో-భేటీ పడావో తదితర కార్యక్రమాలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య వివరించారు. జడ్పీ సిఇఒ చిరంజీవి, డిపిఒ ధనలక్ష్మి, మెప్మా పీడీ రవీంద్ర, సమగ్ర శిక్ష పిఒ ఉషారాణి, ఇన్చార్జి డిఇఓ సుబ్బారావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతిరాజ్‌కు..

# కొత్త ఎస్ఇ



జిల్లా పంచాయతిరాజ్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా కాకినాడలోని రాష్ట్ర ఆరోగ్య మౌలిక వసతుల కల్పన సంస్థలో పనిచేస్తున్న పి.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. ఆ మేరకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. నెల్లూరులో పనిచేస్తున్న ఎస్ఇ సుబ్రహ్మణ్యంను కాకినాడకు బదిలీచేసి అశోక్‌కుమార్ స్థానంలో నియమించారు.

## చేనేత నేత..

# ప్రగడ కోటయ్యకు నివాళి

చేనేత నేత, నేతన్నల సమస్యల పరిష్కారానికి విశేష కృషిచేసిన ఉద్యమకారుడు దివంగత ప్రగడ కోటయ్య 27వ వర్ధంతి కార్యక్రమం ఇటీవల నెల్లూరులో చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగింది. చేనేత నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేనేతకారుల అభ్యున్నతికి ఆయన చేసిన ఉద్యమాలను తలచుకుని, ఆయన పోరాటస్ఫూర్తిని వక్తలు కొనియాడారు. వేదిక కన్వీనర్ బుధవరపు బాలాజీ, ఆశం సురేష్, సిహెచ్ సుబ్రహ్మణ్యం, జొన్నాదుల వేణుగోపాలయ్య, సిద్దాని శంకరయ్య, తుమ్మా గోపాలయ్య, బీసీ సంక్షేమసంఘం నాయకుడు ఎస్.శ్రీనివాసులు, నెల్లూరు రత్నం తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరులో..

# ఉచిత నేత్రవైద్య శిబిరం

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్, ఎల్‌వి ప్రసాద్ కంటివైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల పొదలకూరులోని శ్రీ సాయిబాబా మందిరంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. 83 మందికి కంటిపరీక్షలు చేసి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసేందుకు వైద్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సాయిమందిరం సేవాసమితి ప్రతినిధి కోటేశ్వరరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# రుచీ-శుచీ లేని..'జగనన్న గోరుముద్ద'

## టిడిపి నాయకుల విమర్శ

రాష్ట్రప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం 'జగనన్న గోరుముద్ద' పథకం రుచీశుచీ ఉండడం లేదని, సిఎం సొంత నియోజకవర్గంలోనే ఈ అన్నం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారంటే ఈ పథకం ఎంత ఘోరంగాఉందో తేటతెల్లమవుతోందని జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, పరంధామయ్య తదితరులు విమర్శించారు. నవంబరు 27న కోవూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థత వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. మెస్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులకు కడుపు నిండా అన్నం కూడా ఉండడం లేదని, ప్రభుత్వం ఈ పథకంలో జరుగుతున్న లోపాలను పరిశీలించి విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలని వారు కోరారు.

# మైపాడు..పాడుకాకుండా కాపాడుకుందాం



జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన మైపాడు సాగరతీరాన్ని పాడుకాకుండా కాపాడుకుందామంటూ ఇటీవల కొత్తూరు ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మల్లికార్జున ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సముద్రతీరంలో ఉన్న చెత్తాచెదారాన్ని పరిశుభ్రం చేశారు. 10-ఏ నావెల్ యూనిట్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని వారు చెప్పారు. ఎన్‌సిసి కేర్ టేకర్ అరోరా, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, రజని, సుబ్బరత్నమ్మ, పేరెంట్స్ కమిటీ ఛైర్మెన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నగోపవరంలో..'ఇంటింటికీ భగవద్గీత'



కలువాయి హిందూ ధర్మపరిరక్షణ సమితి వారు నవంబరు 27న కలువాయి మండలంలోని చిన్నగోపవరంలో 'ఇంటింటికీ భగవద్గీత' కార్యక్రమం నిర్వహించి, భగవద్గీత విశిష్టతను గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామంలోని మాతమ్మ దేవస్థానం, రామాలయంల వద్ద నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 120 కుటుంబాల వారికి సమితి సభ్యులు 'భగవద్గీత' పుస్తకాలను పంపిణీ చేశారు. కలువాయి మండలంలోని అన్ని గ్రామాల్లో 'ఇంటింటికీ భగవద్గీత' కార్యక్రమం నిర్వహిస్తామని సమితి వారు ఈ సందర్భంగా చెప్పారు. సమితి సభ్యులు మల్లికార్జున, ప్రసన్నకుమార్, జివి రమణయ్య, శ్రీనివాసులు, జానకిరామయ్య, విశ్వనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసరాజు, మోదు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చీకవోలులో..రైతులకు వ్యవసాయ సూచనలు

సైదాపురం మండలంలోని చీకవోలు గ్రామంలో మినుము పంటను ఇటీవల మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమవతి పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పంటకు పురుగుపట్టడాన్ని గుర్తించి, లద్దెపురుగు నివారణకు మందులను సూచించారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పథకాలను వివరించి, వాటిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అయ్యప్పగుడిలో.. ప్రత్యేక పూజలు



నెల్లూరులోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పూజలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఇటీవల స్వామివారికి విశేషపూజలు నిర్వహించి, మహాదీపారాధన చేశారు. కేరళకు చెందిన ఆలయ తంత్రి నారాయణనంబూద్రి, మేల్‌శాంతి రామన్ తిరుమేని, రామచంద్ర భట్టు, సత్యనారాయణల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పడి కర్పూరదీపం తదితర పూజలు నేత్రపర్వంగా నిర్వహించారు. మేళతాళాల మధ్య ఈ వేడుకలు ఘనంగా చేపట్టారు.

## సామాజిక సమస్యల ప్రతిబింబం..

# శ్రీధర్‌బాబు కవిత్వం

## • 'ఎగురుతున్న పద్యం' ఆవిష్కరణలో వక్తలు



నెల్లూరుకు చెందిన కవి అవ్వారు శ్రీధర్‌బాబు రచించిన 'ఎగురుతున్న పద్యం' కవితాసంపుటిని ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ఆవిష్కరించారు. పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో నవంబరు 27న స్థానిక నెల్లూరు ఆసుపత్రి సమావేశమందిరంలో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. కవయిత్రి గోవిందరాజుల సుభద్రాదేవి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఆవిష్కరణ అనంతరం ప్రథమ ప్రతిని కవి మోపూరు పెంచల నరసింహంకు అందజేశారు. డా.సుంకర గోపాలయ్య పుస్తక సమీక్ష చేశారు. సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ శ్రీధర్‌బాబు కవిత్వం చైతన్యవంతంగా సాగుతూ అందరినీ ఆకట్టుకుంటోందని వక్తలు కొనియాడారు. నవ్యాంధ్ర రచయితల సంఘం-విజయవాడ ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, ప్రకాశం జిల్లా అధ్యక్షులు పొన్నూరు శ్రీనివాసులు, పద్య కళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రముఖ కవులు-రచయితలు డా. కాళిదాసు పురుషోత్తం, లతీఫ్ కుట్టి, చిన్ని నారాయణరావు, జయప్రకాష్, పాతూరు అన్నపూర్ణ, గంగిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కవికి సన్మానం



'ధార్మిక జనమోర్చా-తెలంగాణ' వారి ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కవి సమ్మేళనంలో నెల్లూరుకు చెందిన కవి కొరవి వెంకట కోటేశ్వరకుమార్‌కు ఘన సన్మానం జరిగింది. 'సద్భావనే ప్రగతికి సోపానం' అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో నిర్వాహకులు తాను రచించిన 'ఓ మనిషీ మేలుకో' అనే కవితకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికలను బహూకరించి సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణ, ధార్మిక జనమోర్చా సమన్వయకర్త సాదిక్‌అహ్మద్, కో-ఆర్డినేటర్ మహమ్మద్, అబ్దుల్ రషీద్ తదితరులు చేతులమీదుగా ఆయన ఈ సత్కారాన్ని అందుకున్నారు.



## టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డికి..

# మహారాష్ట్ర భక్తబృందం సన్మానం

మహారాష్ట్రలోని మీరజ్‌గాన్‌కు చెందిన శ్రీ సాయి బాలాజీ పరిషత్ భక్తబృందం వారు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆ భక్తబృందం ఆధ్వర్యంలో తిరుమలలోని శ్రీవారి ఆస్థాన మండపంలో వారం రోజుల పాటు జరిగే పారాయణం కార్యక్రమం ప్రారంభంలో, పరిషత్ అధ్యక్షులు రాజేంద్ర భాసుదాస్‌గోర్ మహారాజ్, పరిషత్ సభ్యులు కలిసి ఆయన్ను ఆత్మీయంగా సత్కరించారు. తొలుత, ఆ భక్తబృందాన్ని టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి సన్మానించి, శ్రీవారి పట్ల వారికున్న భక్తితత్పరతను అభినందించారు. టిటిడి బోర్డు సభ్యులు సౌరవ్, చెన్నై-టిటిడి స్థానిక సలహామండలి అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, విజిఓ బాల్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు.. పెద్ద చదువులు



- 'జగనన్న విద్యాదీవెన'తో మంచి అవకాశం
- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

'జగనన్న విద్యాదీవెన'తో పేద విద్యార్థులు పెద్ద చదువులు చదువుకునేందుకు అవకాశం ఏర్పడిందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. బుధవారం ఉదయం అన్నమయ్య జిల్లా, మదనపల్లి నుండి జగనన్న విద్యా దీవెన పథకం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రింద 2022 జులై-సెప్టెంబర్ త్రైమాసికానికి 11.02 లక్షల మంది విద్యార్థులకు లబ్ది చేకూరుస్తూ రూ.694 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమచేశారు. ఈ సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆనం అరుణమ్మ మాట్లాడారు. ఉన్నత కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని 'జగనన్న విద్యాదీవెన' పథకం కింద రాష్ట్రప్రభుత్వమే భరిస్తోందన్నారు. అనంతరం, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి ఆమె ఈ పథకం కింద జిల్లాలోని 54,329 మంది విద్యార్థులకు సంబంధించి 35.71 కోట్ల రూపాయల మెగా చెక్కును విద్యార్థులకు అందచేశారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జంగం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ వాగులేటి ప్రసన్న, ముస్లిం సంచారజాతుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఆసిఫా, బొందిలి కార్పొరేషన్ ఛైర్మెన్ కిశోర్‌సింగ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కనకదుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస పనులు వేగవంతం చేయండి

రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు సంబంధించి నిర్మిస్తున్న పునరావాస కాలనీల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలను, గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. నవంబరు 29న ఆయన కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, రామాయపట్నం పోర్టు ఎం.డీ ప్రతాప్‌రెడ్డిలతో కలిసి రామాయపట్నం పోర్టు పరిధిలోని నిర్వాసిత గ్రామాలైన మొండివారిపాలెం, రావులవారిపాలెం గ్రామాలకు సంబంధించి నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించారు. అనంతరం, పోర్టు నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని పోర్టు అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట రామాయపట్నం పోర్టు లైజనింగ్ అధికారి ఐ.వి.రెడ్డి, భూసేకరణ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ పద్మావతి, గుడ్లూరు తహసీల్దార్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరి సమస్యలు తీర్చండి

- తిరుపతిజిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



తిరుపతి జిల్లాలోని 'తుడా' పరిధిలో చేర్చబడిన వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని వెంకటగిరి మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల తిరుపతిలో జరిగిన తిరుపతి జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరి మునిసిపాలిటీ, వెంకటగిరి రూరల్, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి శాశ్వత గృహ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వెంకటగిరిలో టిడ్కో గృహాలతో పాటుగా, అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైఎస్సార్ మెగా లేఔట్‌లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సత్వరం నిధులు కేటాయించాలన్నారు. వెంకటగిరి హైస్కూల్ ప్రాంగణంలో ప్రమాదభరితంగా ఉన్న ఇరిగేషన్ సప్లయ్ ఛానెల్‌కు రక్షణ గోడలతో కల్వర్ట్ నిర్మాణానికి అవసరమైన 45 లక్షల నిధులను మంజూరు చేయాలని, వెంకటగిరి గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమైన అదనపు భవనాల నిర్మాణాలను 'నాడు-నేడు' పథకం ద్వారా చేపట్టాలని, కొత్త పిహెచ్‌సిలు మంజూరైన బాలాయపల్లి మండలం జయంపు, డక్కిలి మండలం మోపూరు సెంటర్, వెంకటగిరి వైఎస్సార్ లేఔట్ వద్ద నూతన అర్బన్ హెల్త్ సెంటర్లు త్వరగా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వెంకటగిరిలో 100 పడకల మాతాశిశు హాస్పిటల్ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారని, అది త్వరగా మంజూరయ్యేందుకు అధికారులు కృషిచేయాలని కోరారు. నూతనంగా తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చిన వెంకటగిరి నియోజకవర్గ ప్రాంత సమస్యలు తీర్చాలన్నారు. దివంగత నేత, స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డి శంకుస్థాపన చేసిన సోమశిల-స్వర్ణముఖి లింక్ కాలువ ద్వారా నెల్లూరు-తిరుపతి జిల్లాల పరిధిలోని 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు శాశ్వతప్రాతిపదికపై త్రాగునీరు, సాగునీరు అవసరాలను తీర్చే ప్రాజెక్ట్ పనులను పున:ప్రారంభించేలా డిఆర్‌సిలో తీర్మానం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, టూరిజం శాఖా మంత్రి రోజా, నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కోర్టులో 'ఫైళ్ళ చోరీ'.. గుట్టు తేలేనా?..

- అపహరణ వెనుక ఎవరి పాత్ర ఎంతన్నదే కీలకం!
- సిబిఐ రంగంలోకి దిగితే తప్ప వాస్తవాలు బయటపడవు

ఒకరేమో మంత్రి, మరొకరేమో పూర్వ మంత్రి. ఇద్దరూ ఒకే నియోజకవర్గం నేతలే...ఇద్దరూ ఉక్కుమనుషులే!.. చురుకైన రాజకీయవేత్తలే. నిత్యం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూనే ఉంటారు. ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేసినా భగ్గుమంటుంది. ఈ నేపథ్యంలో ఎప్పుడూ ఉప్పు-నిప్పులా ఉండే ఆ నాయకులకు సంబంధించిన కేసు పరిస్థితి ఇంకాస్త సంకటమైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. ఆ కేసుకు సంబంధించిన 'ఆధారాలు' చోరీకి గురైతే.. రాజకీయవర్గాల్లో ఇంకెంత కలవరంగా ఉంటుందో చూడండి!.. నెల్లూరు జిల్లా కోర్టులో ఆ ఫైళ్ల అపహరణకు గురి కావడం.. అప్పట్లో మరింత సంచలనమైంది. అందుకే ఆ కేసు ఏ చిన్న మలుపు తిరిగినా రాజకీయంగా కలకలం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో.. కేసు దర్యాప్తును హైకోర్టు ఇటీవల సిబిఐకి అప్పగించడం మంచి నిర్ణయం. ఆ తీర్పును అందరూ స్వాగతిస్తున్నారు కూడా.

టిడిపి సీనియర్ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విదేశాల్లో వేలకోట్ల ఆస్తులున్నాయంటూ గతంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపిస్తూ, అందుకు ఆధారాలున్నాయంటూ కొన్ని పత్రాలను విడుదల చేయడం, అయితే అవన్నీ ఫోర్జరీ పత్రాలేనంటూ సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. అయితే, కాకాణిపై, సోమిరెడ్డి దాఖలు చేసిన ఫోర్జరీ కేసుకు సంబంధించిన ఆ డాక్యుమెంట్లు, ఇతర ఆధారాలు నెల్లూరు జిల్లా కోర్టు నుంచి గత ఏప్రిల్‌లో దొంగతనానికి గురికావడం రాష్ట్రవ్యాప్తంగా గగ్గోలు పుట్టించింది. ఈ వ్యవహారానికి సంబంధించి కోర్టు ఇటీవల తీర్పునిస్తూ..ఆ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించింది. కేసుకు సంబంధించిన 'ఆధారాల చోరీ'లో ఎవరిపాత్ర ఎంతుందనేది కూడా తేల్చాలని హైకోర్టు సిబిఐకి సూచించింది. నెల్లూరు చిన్నబజారు పోలీస్ స్టేషన్‌లో నమోదుచేసిన కేసు ఫైళ్లను సిబిఐకి అప్పగించి దర్యాప్తుకు సహకరించాలని కూడా ఆదేశించింది. కోర్టులో ఆ కీలకపత్రాలు చోరీ అయినప్పుడు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీరియస్‌గా వ్యవహరించి ఆ ఘటనకు సంబంధించి నివేదిక పంపడంతో హైకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ ప్రారంభించింది కూడా. కీలకమైన ఫైళ్ళు మాయం కావడంతో కేసు మరింత జటిలంగా మారింది. ఫైళ్ళ విషయంలో భద్రత వహించాలని, ఆధారాలు కీలకం కనుక వాటిపట్ల పోలీసులు మరింత జాగ్రత్తతో ఉండాలని హైకోర్టు అధికార యంత్రాంగానికి సూచించింది. ఏదేమైనా.. ఆ కేసుకు సంబంధించిన ఫైళ్ళ అపహరణ ఎలా జరిగిందో..చోరీ వెనుక ఎవరి హస్తం ఉందో తేలితే తప్ప ఈ కేసులో వాస్తవాలు బయటకు వచ్చేలా కనిపించడం లేదు. సిబిఐ పూర్తిస్థాయిలో రంగంలోకి దిగితే తప్ప ఈ వ్యవహారం ఒకపట్టాన తేలేట్టులేదు.

# ఘరానా దొంగ దొరికాడు

- రూ.3.36 లక్షల నగలు, 3 బైక్‌లు స్వాధీనం




విలాసాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్న ఓ ఘరానా దొంగ పోలీసులకు దొరికిపోయాడు. కోవూరు పోలీసు కార్యాలయంలో బుధవారం రూరల్ డిఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆ నిందితుని వివరాలు వెల్లడించారు. నెల్లూరు ఉడ్‌హౌస్ సంఘానికి చెందిన గోర్ల రాజేంద్రప్రసాద్ కోవూరు పరిసరప్రాంతాల్లో చోరీలకు అలవాటుపడ్డాడు. ఇటీవల ఓ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగిని ఇంటికి తాళం వేసి కరెంట్ బోర్డుపై పెట్టి వెళ్ళడాన్ని గమనించి, ఆ తాళం తీసుకుని దొంగతనానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న బంగారు నగలతో పాటు మోటార్‌సైకిల్‌ను కూడా తీసుకుని పారిపోయాడు. ఆ ఉద్యోగిని వచ్చి చూసేసరికి దొంగతనం జరిగిపోయింది. ఆమె వెళ్ళి పోలీసులకు ఫిర్యాదుచేయడంతో సిఐ కె.రామకృష్ణారెడ్డి, ఎస్ఐ దాసరి వెంకటేశ్వరరావు వెళ్ళి ప్రత్యేక బృందాలతో గాలించి, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని వల పన్ని పట్టుకున్నారు. విచారించగా, గతంలో అపహరించిన మోటార్‌సైకిళ్ళు, బంగారునగలు కూడా నిందితుని వద్ద దొరికాయి. మొత్తంగా 3.36 లక్షల రూపాయల విలువచేసే బంగారు నగలు, వెండి వస్తువులు 4.63 లక్షల విలువచేసే మోటార్‌బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, నిందితుని పై గతంలో కూడా కేసులున్నాయని వివరించారు. చోరీ జరిగిన గంటల వ్యవధిలోని నిందితుడిని పట్టుకున్న పోలీసులను డిఎస్పీ అభినందించారు.

లాయర్
డిసెంబర్ 02, 2022

# ప్రపంచానికి పేదరికమే పెనుశాపమా?

ప్రపంచానికిప్పుడు పేదరికమే పెనుశాపంగా మారుతోందా?.. అన్న ప్రశ్నకు 'అవును' అనే సమాధానమే వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ అధ్యయనాల్లో ఆ విషయం తేటతెల్లమవుతోంది కూడా. అంతేకాదు, రానురాను ఈ భూప్రపంచానికి పేదరికమే అన్నిటికన్నా పెద్ద సవాల్‌గా పరిణమిస్తుందని కూడా నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో.. అంటే మరో పదేళ్లలోనే ప్రపంచంలో వంద మిలియన్ల మందికి పైగానే ప్రజలు అత్యంత దయనీయమైన పేదస్థితిలో పడి విలవిలలాడిపోతారని తాజాగా ఐక్యరాజ్యసమితి అధ్యయనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే వందకు పైగా దేశాల్లో కోట్లాదిమంది పేదలు అనేకరకాల పేదరికపు అవస్థలతో కొట్టుమిట్టాడుతున్నారు. కోవిడ్ మహమ్మారి ఒకవైపు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ప్రకృతి విపత్తులు, ఆర్థిక మాంద్యాలు అన్నీ కలిసి వెరసి సగటు మానవుడిని పేదరికం కోరల్లోకి నెట్టేస్తున్నాయి. కోవిడ్ ప్రపంచాన్నంతా వణికిస్తున్న కాలంలో ప్రపంచమంతా జనజీవనం స్తంభించిపోయింది. పెద్దపెద్ద దేశాల్లో సైతం ఆర్థికస్థితిగతులు చిన్నాభిన్నమై కోట్లాదిమంది పేదరికంలో పడిపోయారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికీ ఆ ప్రభావం సమసిపోలేదు. అనేక దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలితో అల్లాడుతూనే ఉన్నారు. సరైన ఆహారం లభించక, పోషకాహారం అందక ఆకలితో అలమటిస్తున్నారు. చిన్న దేశాల్లో మరీ ఆహార భద్రత కరువైంది. నిరుద్యోగం జడలరాకాసిలా విజృంభిస్తూనే ఉంది. కొనుగోలు శక్తి కోల్పోయి, పెరుగుతున్న ధరలను అందుకోలేక సామాన్యులు నిత్యం కటకటపడుతూనే ఉన్నారు. మనదేశం కోవిడ్ నుంచి కోలుకుని, ఇప్పుడిప్పుడే ప్రగతివైపు పయనిస్తున్నా పోషకాహార లోపంతో బాధలు పడుతున్నవారు కోట్లాదిగానే ఉన్నారు. ముఖ్యంగా ఇంటిల్లిపాదికీ అన్నం పెట్టి ఆ తర్వాతనే మిగిలిన అడుగుబొడుగు తినే సామాన్య, నిరుపేద గృహిణుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. సరైన పౌష్టికాహారం లేకపోవడంతో మాతృమరణాలు, శిశుమరణాలు పెరుగుతూనే ఉన్నాయి. బాలలైతే మరీ బక్కచిక్కిపోతున్నారు. వ్యవసాయం కుదేలైపోవడం, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పరిశ్రమలు మూతపడడం, కార్మికులకు, కర్షకవృత్తుల వారికి ఉపాధి కరువు, పట్టణ-గ్రామీణ ఉపాధి పథకాలు ఆశించిన స్థాయిలో అందుబాటులో లేకపోవడం..ఇలా ఎన్నో కారణాలతో దేశప్రజలు ఇంకా అవస్థల్లోనే ఉన్నారు. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా అతివేగంగా పెరుగుతున్న జనాభా ప్రపంచానికి మరో పెద్ద సమస్యగా మారుతోంది. ఇప్పటికే ఈ భూమండలం మీద జనాభా 800 కోట్లను దాటేసింది. జనాభా వేగంగా పెరుగుతున్న దేశాల్లో మనదేశమే ముందుంది. వచ్చే ఏడాది (2023) నాటికి మనదేశం ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కల దేశంగా అగ్రస్థానానికి చేరుకోబోతోందని, ప్రస్తుతం జనాభాలో మొదటిస్థానంలో ఉన్న చైనాను భారత్ అధిగమించనుందని కూడా ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. అయితే, జనాభా పెరుగుతుందని సంకోచించాల్సిన అవసరమే లేదు. ఆ జనాభానే అద్భుతంగా మలుచుకుని, కష్టపడి ఉత్పత్తులను పెంచుకునేలా చేసి ప్రగతిపథంలో ముందుకు సాగాలి. అందుకు కేంద్రం-రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఇప్పటినుంచే ప్రణాళికలతో సిద్ధం కావాలి. అప్పుడే జనాభా పెరిగినా అభివృద్ధికి వీలు కలుగుతుంది. దేశానికి మేలు జరుగుతుంది. అన్నిటికన్నా ముఖ్యంగా పేదరికాన్ని నిర్మూలించాలి. వ్యవసాయాన్ని బాగా ప్రోత్సహించడం, పరిశ్రమల స్థాపనకు సహకరించడం, కుటీర పరిశ్రమలను విస్తారంగా నెలకొల్పడం, ఉపాధిహామీ పథకాలకు పుష్కలంగా నిధులు కేటాయించడం, ఆహారం కొరత ఏర్పడకుండా చూడడం, విద్య-వైద్యం వంటి ప్రాధాన్యతారంగాలను బాగా అభివృద్ధి చేయడం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం వంటి విధులను ప్రభుత్వాలు వెంటనే చేపట్టాలి.

ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా మానవాళిని పట్టిపీడిస్తున్న పేదరికాన్ని అన్నిదేశాలు ఏకమై జయించాలి. ప్రపంచానికే సవాల్ విసురుతున్న పేదరికాన్ని పెకలించివేయాలి. పేదరికం లేని ప్రపంచాన్ని సాకారం చేసుకోవాలి. ఎలాంటి బాధలు లేకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండేలా చూడాలి! అణ్వస్త్రాలు కాదు.. అన్న వస్త్రాలకు లోటు లేకుండా చూసుకోవాలి. అన్ని దేశాలు సమిష్టి వ్యూహంతో, పరస్పర సహకారంతో కదిలినప్పుడే అది సాధ్యమవుతుంది. ఏదేమైనా సరే..ఆకలి కేకలు లేని ప్రపంచాన్ని నిర్మించుకున్నప్పుడే.. మానవాళి విజ్ఞతకు, విజ్ఞానానికి సార్థకత చేకూరుతుంది.

# ఆటో!.. ప్రాణాలు ఎటో!



ఒక్కోసారి రోడ్లమీద రయ్యిమంటూ అత్యంత వేగంగా వెళ్తున్న ఆటోలను చూస్తుంటే.. 'బాబోయ్.. వీటిల్లో ఎక్కితే మనం బతికి బట్టకట్టగలమా' అనిపిస్తుంటుంది. సన్న సన్న సందుల్లో కూడా అతివేగమే. రోడ్ రూల్స్ అన్నవి వారికి ఏ కోశానా పట్టవు. సందు దొరికితే చాలు..దూరేయడమే. రోడ్లమీద స్పీడ్‌బ్రేకర్లున్నా, పెద్దపెద్ద గతుకులున్నా లెక్కే లేకుండా దబదబమంటూ దూసుకుపోవడమే తప్ప, ఆటోల్లో కూర్చున్న మహిళలు, వృద్ధుల పరిస్థితి ఎలా ఉంటుందనేది పట్టించుకోరు. చిన్నపిల్లలు, గర్భిణులు ఎవరైనా ఆటో ఎక్కితే చాలా జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. ట్రాఫిక్ రద్దీగా ఉన్నా స్పీడ్ మాత్రం 'తగ్గేదే లే' అన్నట్లుంటాయి. ఎవరో కొంతమంది మంచి డ్రైవర్లు కూడా ఉంటారు. జాగ్రత్తగా.. ముందు వెనుకా చూసుకుని వెళ్తుంటారు, చెప్పింది వింటారు. కానీ, అత్యధికశాతం ఆటోలు చాలా రఫ్‌గానే తిరుగుతుంటాయి. అందులో నెల్లూరు నగరం ఇటీవలికాలంలో ఆటోల సామ్రాజ్యం అన్నట్లుగా తయారైంది. ఎక్కడ చూసినా ఆటోలే. పెరిగే జనాభా కంటే అధికంగానే పెరుగుతున్నాయి. ఎక్కడికి పోవాలన్నా ఆటోలు రెడీ!.. ప్రజలకి ఇవెంతో ఉపయోగం..పేద, మధ్యతరగతి జీవులకి వాహనయోగం!..మంచిదే!..కానీ, అనేకచోట్ల వాటి నడకే భయం గొలుపుతోంటుంది. ఒక్క ఆటోలో పదేసిమందిని-పదిహేనుమందిని కూడా కుక్కించేస్తుంటారు. ఇరుక్కొని కూర్చుని ప్రయాణించాలంటే ఎంత కష్టమో వాళ్లకెలా తెలుస్తుంది. డ్రైవర్‌కు అటు పక్క ఇద్దరు, ఇటు పక్క ఇద్దరు కూడా కూర్చుంటారు. మధ్యలో డ్రైవర్ కాలిమీద కాలేసుకుని (చోటుచాలదు కాబట్టి) ఒంటికాలితో, ఒంటిచేత్తో ఆటోను నడుపుతుంటాడు. మధ్యలో ఫోనొచ్చినా అట్లనే మాట్లాడుతుంటాడు. వెనుక సీట్లు, దాని వెనుకుండే లగేజీ చోటు అన్నీ ఫుల్. ఆటోలో వేలాడుతూ పోవడం..సర్కస్ ఫీట్‌లా ఉంటుంది. అంతా కలిసి కనీసం పదిహేనుమందైనా సరే ఇరికించేసి లాగించేస్తారు. నలుగురో అయిదుగురో ఉండాల్సిన ఆటోలో అంతమంది ఉన్నా ఎవరూ పట్టించుకోరు. దురదృష్టవశాత్తూ ఏ ప్రమాదమో జరిగితే ఏంకావాలి?.. ప్రయాణీకులు గుండెలు అరచేత్తో పట్టుకునుంటారు. ఏంచేద్దాం?.. సమయానికి బస్సులు రావు. కాబట్టి ఆటోలే గతి. ఆటో ఎక్కేశాక..ఇక ఆ దేవుడే

## సమస్యల తో 'రణం'

దిక్కు. దిగేదాకా ప్రాణాలు గాల్లోనే. అంతా..దైవాధీనం సర్వీసులు. నెల్లూరు నగరం నుంచి పక్కనే ఉన్న చిన్న పల్లెలకి నిత్యం వెళ్లే ఆటోల్లో ఇవన్నీ రోజూ చూసేవే. ముఖ్యంగా కోవూరు వైపు, నరసింహకొండ-జొన్నవాడ వైపు, మరోపక్క గొలగమూడి తదితర ప్రాంతాల వైపు వెళ్ళే ఆటోల్లో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణం. కొన్ని ఆటోల్లో యువకులు డ్రైవర్లు. వాళ్ళకి సినిమా పాటల పిచ్చి. పెద్ద సౌండ్‌తో పాటలు పెట్టేస్తారు. ఆటోలో కూర్చున్నవారికి చెవులు చిల్లులు పడుతుంటాయి. వాటిని ఆపమని చెప్పాలంటే ప్రయాణీకులకు సంకోచం. ఆ పాటలు వినలేకపోతున్నా, ఏమీ అనలేక అందరూ గమ్మున ఉంటారు..ఆ సౌండ్‌ని భరాయిస్తూ!..ఇంకొన్ని ఆటోల వాళ్ళు తమ ఫోన్లలో ఏదేదో మాట్లాడుకుంటూ ఆటో నడుపుతుంటారు. మరికొంతమంది మధ్యలో నిలిపేసి మరీ మాట్లాడుతుంటారు. త్వరగా పోవాల్సిన ప్రయాణీకులు బిక్కముఖాలతో కూర్చుని ఉంటారు. ఇంకొన్ని చోట్ల..ఆటో వెంటనే బయలుదేరుతుంది అన్నట్లుగా 'ఎక్కండి ఎక్కండి' అంటారు. బుర్‌బుర్ అంటుంటుందే తప్ప ఒక పట్టాన కదలదు. ఆటో నిండేదాకా చూస్తుంటారు. దిగేద్దామంటే.. 'పోదాం ఉండండి' అంటారు. వారి పొట్టాత్రం వారిది.. కాదనలేం కానీ, అర్జంట్‌గా వెళ్ళాల్సిన ప్రయాణీకులకి లేటైపోతున్నా..ఎంతకీ కదలకపోతే ఎలా?..ఇవన్నీ మన నగరంలో నిత్యం జరుగుతున్నవే. అందరికీ తెలిసినవే. ఆటోల వాళ్ళకి నిబంధనలున్నా అసలు పట్టించుకోరు. డ్రైవర్లు ఖాకీ చొక్కా వేసుకోవాలని, ప్రయాణీకులతో దురుసుగా మాట్లాడకూడదని, డ్రైవరు పక్కన ఎవరినీ ఎక్కించుకోకూడదని, నిబంధనలకు మించి ఎక్కువమందిని ఇరికించకూడదని, ఆటోలు కండిషన్‌లో ఉండాలని, ఆటో నడిపేటప్పుడు మధ్యలో ఫోన్‌లో మాట్లాడకూడదని, అతివేగం పనికిరాదని..ఇలా బోలెడు నియమాలున్నాయి. ఎవరు పట్టించుకుంటున్నారు?..ఎవరిష్టం వారిదే. పోలీసులు, రవాణా అధికారులు ప్రయాణీకుల భద్రత దృష్ట్యా ఇకనైనా ఇలాంటి విషయాలపై అప్పుడప్పుడూ కౌన్సిలింగ్ ఇస్తుండాలి. నిబంధనలు పాటించని ఆటోల దూకుడుకు బ్రేకులు వేయాలి.

**- సంచారి**

# రాయుడు అదరగొడుతున్నాడు




మన 'లాయర్'లో భోగాది రాయుడి 'మనలో మాట' స్ఫూర్తివంతంగా, సందేశాత్మకంగా ఉంటోంది. చెప్పదలుచుకున్న విషయాన్ని పార్టీల కతీతంగా నిర్మొహమాటంగా నిష్పక్షపాతంగా చెప్తున్నాడు. గత వారానికి ముందు వారం లోకేష్‌కి ఆయన ఇచ్చిన సలహా అర్థవంతంగా ఉంది. చిన్న వయసులో రాజకీయాలలోకి ప్రవేశించి, వచ్చీ రాగానే అడ్డదారిలో మంత్రి పదవి దక్కించుకోవడం నాయకుడి లక్షణం కాదు. జనంలో నుండి వచ్చినవాడే నిజమైన నాయకుడు కాగలడు, పరిపక్వతతో ఆలోచించగలడు. తాత నుంచి లాక్కున్న తండ్రి పార్టీలో నేరుగా మంత్రి కుర్చీలో కూర్చున్న లోకేష్ రాజకీయ అపరిపక్వత ఆ కొద్దికాలంలోనే బయటపడిపోయింది. రాయుడు గారు చెప్పినట్లు లోకేష్‌ది చిన్నవయస్సు, ఆయనకు ఇంకా చాలా భవిష్యత్తు ఉంది. ముందుగా పార్టీకి పూర్వవైభవం తేవడంలో కీలకంగా వ్యవహరించి, ఆ తరువాత పదవుల గురించి కలలు కంటే బాగుంటుంది. ఆయన చేపట్టనున్న పాదయాత్ర అతనిలో కొంత మార్పు తెస్తుందేమో చూడాలి.

గత వారం వ్యాసంలోకూడా అధికార, ప్రతిపక్ష పార్టీలు అవలంబించాల్సిన విధానాలపై స్పష్టత ఇచ్చారు రాయుడు. విమర్శలు, ప్రతివిమర్శలతో తమ ప్రతిష్టను దిగజార్చుకుంటున్న పార్టీల వల్ల సమాజానికి జరుగుతున్న నష్టాన్ని స్పష్టంగా వివరించారు. ప్రతీవారం 'మనలోమాట'లో మంచి విషయాలను సమర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా చర్చిస్తున్న రాయుడుగారికి నా అభినందనలు.

**రాణిభరద్వాజ్, హైదరాబాదు.**

# నెల్లూరు నగరం డ్రగ్స్ మయం!

ఎంతో ప్రశాంతమైన నెల్లూరు నగరం ఇప్పుడు అశాంతికి నిలయంగా మారిపోయింది. డ్రగ్స్ మాఫియా నెల్లూరులో రాజ్యమేలుతోంది. ఎప్పుడూ లేని విధంగా యువత మాదకద్రవ్యాల మత్తులో జోగుతోంది. నిండా పదహారేళ్లు కూడా రాని టీనేజ్ యువతీయువకులను ఈ మత్తుమందుల ముఠా ఆకర్షిస్తోంది. యువత డ్రగ్స్ సేవించి ఆ మత్తులో పట్టపగలే ద్విచక్ర వాహనాలలో విన్యాసాలు చేస్తూ వెళ్తున్నారు. కార్లలో కూడా మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రజలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నగరంలో దౌర్జన్యాలు, దొంగతనాలు, దోపిడీలు, హత్యలతో పాటు డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలు కూడా విచ్చలవిడిగా పెరిగిపోయాయి. జిల్లాలో అసలు పోలీసుశాఖ ఉందా..? అని అనుమానం కలిగేలా పరిస్థితులు దాపురించాయి. రాష్ట్రస్థాయి పోలీసు అధికారులన్నా జోక్యం చేసుకుని ప్రజలని కాపాడాలి. లేదంటే నెల్లూరుకి ఆ దేవుడే దిక్కు..!

**ఎన్.వి. రమణారెడ్డి, జేమ్స్‌గార్డెన్.**

# ఆక్రమణల తొలగింపు సాధ్యమేనా?

రోడ్డు మార్జిన్లను ఆక్రమించుకుని టీ అంగళ్ళు, చాట్‌బండ్లు , పానీపూరి వాలాలు... వాటి ముందు ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్. టౌన్‌లో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మినీబైపాస్, అన్నమయ్య సర్కిల్, మాగుంట లేఅవుట్ వంటి ప్రాంతాలలో ఈ ఆక్రమణల జోరు ఎక్కువగా ఉంది. ఆక్రమణలను అదుపుచేసే దమ్ము, ధైర్యం కార్పొరేషన్ అధికారులకు ఉందా...? అన్న విషయం ప్రశ్నార్థకమే. అదే సమయంలో తమ ఇష్టానుసారం వాహనాలను నిలిపి గంటల కొద్దీ బాతాఖానీ కొడుతున్న వాహన యజమానులను నిలదీసే సాహసం ట్రాఫిక్ పోలీసులు చేయగలరా అన్నది కూడా అనుమానమే. ఈ టీ దుకాణాల దగ్గర చిట్‌చాట్ చేసేవాళ్లంతా ఏదో ఒక పార్టీకి చెందిన నాయకుల అనుచరగణమే. వాళ్ళ జోలికి వెళ్తే ప్రమాదమని పోలీసులకు బాగా తెలుసు. ఈ ఆక్రమణలపై కొరడా ఝుళిపించమని మునిసిపల్ కమీషనరమ్మ కన్నెర్ర చేశారని వార్తలు వస్తున్నాయి. ఇది సాధ్యమయ్యే పనేనా..? అయితే మంచిదే...!

**ఆర్. పి. రామయ్య, కొండాయపాళెం.**

# మోపూరును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా!

## స్వగ్రామంలో నెల్లూరు ఎంపీ ఆదాల



తన స్వగ్రామమైన అల్లూరు మండల పరిధిలోని నార్త్ మోపూరు గ్రామాన్ని ఎంపీ నిధులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇటీవల ఆదాల నార్త్ మోపూరుకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఆదాలను కలిశారు. గ్రామాభివృద్ధి గురించి ఆయన వారితో చర్చించారు. నార్త్ మోపూరులో ఇప్పటికే చాలా వరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు కూడా ఆరేడు నెలల్లో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కరోనా సమయంలో దేశమంతా ఇబ్బందిపడితే, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన సంక్షేమ కార్యక్రమాల ద్వారా రెండేళ్ల పాటు రాష్ట్ర ప్రజలను ఆర్థికంగా ఆదుకున్నారని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా అందరినీ కలుస్తామని, ఇంకా లోపాలేమైనా ఉంటే గ్రహించి ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ రంగారెడ్డి, జడ్పీటిసి మల్లు సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, స్థానిక వైకాపా నేత అబ్దుల్లా, నరసింహారావు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత నార్త్ మోపూరు సమీపంలోని బీరంగుంట గ్రామంలో ఆదాలకు బీరంగుంట ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆత్మీయంగా పూలతో స్వాగతించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్మిస్తున్న పోలేరమ్మ గుడి విషయమై త్వరలో చర్చిద్దామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

### మైపాడుగేట్ రోడ్డు వెడల్పుతో ప్రజలకు సౌకర్యం

ఇందుకూరుపేట–తోటపల్లి గూడూరు మండలాలకు ముఖద్వారమైన మైపాడు గేటు రోడ్డు వెడల్పుతో ఈ ప్రాంతానికి చాలా మేలు జరుగుతుందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరులోని మైపాడు గేటు రోడ్డు సెంటర్లో నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి రోడ్డు వెడల్పు కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ రోడ్డు వెడల్పు పూర్తయితే ఈ ప్రాంతం ఎంతో అందంగానూ, సౌకర్యవంతంగానూ తయారవుతుందని, తద్వారా నగర ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాలకు పలువురు ప్రముఖులు ఆత్మీయ సన్మానం చేశారు. విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, జడ్పీటిసి మల్లు సుధాకర్ రెడ్డితో పాటు స్థానిక కార్పొరేటర్లు, వైకాపా నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

### అల్లూరులో విచారింపు

అల్లూరుకు చెందిన వైకాపా నేత నీలం సాయికుమార్‌ను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల కలసి పరామర్శించారు. సాయికుమార్ తండ్రి మస్తానయ్య స్వర్గస్తులు కావడంతో వారి కుటుంబసభ్యులకు ఆదాల ప్రగాఢ సంతాపం తెలిపారు.

### బొమ్మిరెడ్డి వెంకురెడ్డికి ఆదాల శ్రద్ధాంజలి

మనుబోలు మాజీ సర్పంచ్, వైకాపా సీనియర్ నాయకుడు బొమ్మిరెడ్డి వెంకురెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి కన్నుమూశారు. మనుబోలు సాగునీటి సంఘం అధ్యక్షునిగా కూడా ఆయన పని చేశారు. వెంకురెడ్డి మృతి సమాచారం తెలిసిన వెంటనే అనేకమంది నాయకులు, ప్రముఖులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

## నిత్యం ప్రజల్లో ఉండే నేత.. మహీధర్‌రెడ్డి

### ఆదాల ప్రశంస



నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కలిగి, ప్రజల్లో ఉండే మంచి నేత ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రశంసించారు. కందుకూరు మండలంలోని ఓగూరు గ్రామంలో గతనెల 28న జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి నేతృత్వంలో కందుకూరు నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందిందని, భవిష్యత్తులో ఇంకా బాగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమర్థుడైన మహీధర్‌రెడ్డి మరింతకాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ, కందుకూరు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తనకు పూర్తి సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి చెప్పారు. తాను కోరగానే కందుకూరు మున్సిపాలిటీకి 50 లక్షల రూపాయల విలువచేసే జెసిబి, ఫాగింగ్ మిషన్, ట్రాక్టర్‌ను అందజేశారని సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా కందుకూరు పరిధిలోని హైవేపై రెండు బ్రిడ్జిలను మంజూరు చేయించారని కూడా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్లు

అల్లూరు మండలంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళల జీవనోపాధి కోసం నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కార్యక్రమం పలువురు నిరుపేద మహిళలకు ఉపాధినందిస్తోంది. అక్కడ శిక్షణ పొందిన 32 మంది మహిళలకు ఇటీవల కెనరా బ్యాంక్–అల్లూరు బ్రాంచ్ మేనేజర్ తిక్కవరపు సాయి సందీప్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌లను అందజేశారు. అదేవిధంగా, ఆర్థికంగా వెనుకబడిన 9 మంది మహిళలకు కుట్టుమిషన్‌లు కొనుగోలు చేసుకునేందుకు ఆ బ్యాంకు వారే రుణాలను కూడా అందించి వారికి తమ చేయూతనందించారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథ రామిరెడ్డి, ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనీల్‌కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి, టైలరింగ్ ఫ్యాకల్టీ మజహర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో.. 'సుబ్రహ్మణ్య షష్టి'



'సుబ్రహ్మణ్య షష్టి' సందర్భంగా నవంబరు 29న జిల్లావ్యాప్తంగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు చేశారు. నెల్లూరు నగరంలోనూ అన్ని సుబ్రహ్మణ్యస్వామి గుడుల్లో పూజలు, అభిషేకాలు వైభవంగా జరిగాయి. వరికుంటపాడు మండలంలోని పామూరులో శ్రీ సుబ్బరాయుడు స్వామి దేవాలయంలో స్వామివారి మూలమంత్రంతో హోమాలు చేసి, పంచామృతాభిషేకం, పుష్పయాగం కనువిందుగా చేపట్టారు. అదేవిధంగా రూరల్ మండలంలోని కనుపర్తిపాడులో కొలువైవున్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలోనూ, కొత్తూరుల్లో ఉన్న ఆలయంలోనూ విశిష్ట పూజలు నిర్వహించారు. నెల్లూరు నగరంలోని ఉస్మాన్‌సాహెబ్ పేటలో ఉన్న శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వనాథస్వామి దేవాలయంలో కొలువైవున్న వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కన్నులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో స్వామివార్ల మూలమూర్తులను శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ వైవి రమణకుమార్, కమిటీ సభ్యులు, ఇఓ జి.దుర్గయ్య పర్యవేక్షించారు.

# 'తంగిరాల మహాభారతం' 32వ భాగం




జనమేజయ మహారాజు వైశంపాయనుణ్ణి.. కృప, ద్రోణ, ద్రుపదుల చరిత్ర చెప్పమని అడుగుతాడు. గౌతమ మహర్షి కొడుకు శరద్వంతుడు ధనుర్విద్య మీదనే ఆసక్తి చూపి అపూర్వ అస్త్ర, శస్త్రాలను సంపాదించుకుంటాడు. అతను ఇంకా ఘోర తపస్సు చేస్తుంటే, ఇంద్రుడు జలపథి అనే దేవకన్యను తపస్సు భంగం చెయ్యమని పంపుతాడు. ఆమె అందాలని చూసి శరద్వంతునికి వీర్య స్కలనం అయ్యి, రెళ్ళు గడ్డి మీద పడి రెండు భాగాలుగా విడిపోతుంది. శరద్వంతుడు ఇంకో ఆశ్రమానికి వెళ్లి తపస్సు చేసుకుంటాడు. ఆ వీర్యంలో నుంచి ఒక పాప, బాబు పుడతారు.

అదే సమయానికి శంతను మహారాజు వేటకు వచ్చినప్పుడు ఆ పిల్లల్ని తీసుకెళ్లి పెంచుకుంటాడు. వారే కృపి, కృపు. శరద్వంతుడు కొన్నాళ్లికి అది తెలుసుకుని శంతను మహారాజు దగ్గరకు వెళ్లి తన పిల్లల్ని తెచ్చుకుని కృపుకి 4వేదాలు, ధనుర్విద్యని నేర్పుతాడు. కృపుడు, ధనుర్విద్యలో అగ్రగణ్యుడవుతాడు. అది తెలుసుకుని భీష్ముడు కృపుణ్ణి కౌరవ, పాండవ కుమారులకు గురువుగా నియమిస్తాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**



# కన్నులపండువగా..శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం 'శ్రవణా నక్షత్రం' సందర్భంగా నవంబరు 29వ తేదిన నెల్లూరు బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు దాశరథి నారాయణాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు జరిగాయి. అనంతరం కన్నులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్-ఉషారాణి దంపతులు వ్యవహరించారు. మందిరం కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

# విద్యార్థులకు..ఎడ్యుకేషన్ టూర్లు

## -- కృష్ణపట్నం పోర్టు సందర్శనకు ఏర్పాట్లు --



ఆదాని ఫౌండేషన్ ప్రాజెక్టు-ఉడాన్ కింద విద్యార్థులకు ఎక్స్‌పోజర్ టూర్లు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి డిఇఓ సుబ్బారావు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కృష్ణపట్నంలోని ఆదాని పోర్టును సందర్శించేందుకు, ఆదాని విల్మార్ లిమిటెడ్ వంటి ఆదాని గ్రూప్ సౌకర్యాలను తిలకించేందుకు ఒకరోజు ఎడ్యుకేషన్ ట్రిప్‌కు అవకాశం ఇస్తున్నారని, జిల్లాలోని ప్రభుత్వ-ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు వాహనసౌకర్యం కూడా కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆదాని ఫౌండేషన్ వారిని సంప్రదించాలని, వివరాల కోసం డిఇఓ వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన కోరారు.

# వంద కేజీల..నిల్వ మాంసం పట్టివేత

## ➤ చికెన్‌స్టాల్‌లో ఎంహెచ్ఓ తనిఖీ



నెల్లూరు నగరంలో చికెన్ దుకాణాల వారు మాంసాన్ని నిల్వచేసి అమ్ముతుండడం సర్వసాధారణమైపోయింది. అలా చేయడం వల్ల అది కుళ్ళిపోయి అనారోగ్యాలకు దారితీస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. తాజాగా మంగళవారం నాడు నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న ఓ చికెన్‌స్టాల్‌పై మునిసిపల్ ఆరోగ్యాధికారి వెంకటరమణ ఆకస్మిక తనిఖీలు చేసి, అక్కడ ఫ్రీజర్లలో వంద కేజీల కోడిమాంసాన్ని నిల్వచేసినట్లు గుర్తించారు. ఆ మాంసాన్నంతా ఫినాయిల్‌తో నిర్వీర్యం చేయించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. దుకాణదారుకు నోటీసులిచ్చారు. వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదన్నారు. చికెన్‌స్టాల్స్, హోటల్స్, రెస్టారెంట్లలో, బేకరీల్లో ఎక్కడైనా సరే ప్రజలు తినే ఆహార పదార్థాలు నాణ్యతగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# లైబ్రరీకి పుస్తకాల బహూకరణ



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న దొడ్డ వ ద్మా వ త మ్మ మహిళా గ్రంథాలయానికి స్థానిక శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు 80 పుస్తకాలను బహూకరించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ నాయకుడు అరవ రాయప్ప, జిల్లా క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ కోశాధికారి పెసల ధనుంజయ, గ్రంథాలయ ఉద్యోగి పి.మంజుల, బి.సరళ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

# మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు అపూర్వం

## - నివాళులర్పించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి -



అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా నవంబరు 28న రాజ్యసభ సభ్యులు మరియు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూలే సేవలను తలచుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరులోని తమ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సామాజిక విప్లవోద్యమ పితామహులు, గొప్ప సంఘ సంస్కర్త అయిన మహాత్మా జ్యోతిరావు పూలే సేవలను ఆయన ప్రస్తుతిస్తూ, దేశంలో బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే చేసిన సేవలు అపూర్వం.. అపారమని కొనియాడారు.

# చదువుతో పాటు.. క్రీడల్లోనూ రాణించాలి

## విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి




విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి చెప్పారు. మంగళవారం విఎస్‌యు అంతర్‌కళాశాలల మహిళా క్రీడాపోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడల్లో ముందుంటే మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం విద్యార్థినులకు టెన్నికాయిట్, ఖోఖో పోటీలు జరిగాయి. డికెడబ్ల్యు కాలేజీ ప్రిన్సిపాల్ డా.గిరి, విఎస్‌యు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా.సునీత, ఆర్గనైజింగ్ సెక్రటరీ శశికళ పాల్గొన్నారు.

# నేత్రదానం



నెల్లూరు సమీపంలోని అల్లీపురానికి చెందిన మాతిరెడ్డి ఆదిశేషారెడ్డి (70) నవంబరు 28వ తేది రాత్రి మరణించారని, ఆయన మరణానంతరం వారి కుటుంబసభ్యుల అంగీకారంతో ఆదిశేషారెడ్డి నేత్రాలను(కార్నియా) దానం చేశారని జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డా.ఎం.శర్వాణి ఒక ప్రకటనలో తెలిపారు. నేత్రదాన మోటివేటర్, చిరంజీవి బ్లడ్ అండ్ ఐ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ సకాలంలో సమాచారం అందించి నేత్రదాన ప్రక్రియలో పాల్గొన్నారని, నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల టెక్నీషియన్ లాలేష్‌లు ఆ నేత్రాలను సేకరించి, వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం సర్టిఫికెట్‌ను అందజేసి కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు. నేత్రదానం చేసేవారు 9948164781 (లాలేష్), 93471 11033 (బాలాజీసింగ్) ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

# కెవిఎన్‌ఆర్‌లో.. ఎన్‌సిసి డే



10-ఆంధ్ర నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో నవంబరు 27న నెల్లూరులోని కెవిఎన్‌ఆర్ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో ఎన్‌సిసి దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్‌సిసి అధికారి గుండాల నరేంద్రబాబు పాల్గొని ఎన్‌సిసి దినోత్సవం ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ విశ్రాంత అధికారి రఘు, వ్యక్తిత్వ వికాస నిపుణులు పి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగుకు బ్యాంకులు తోడ్పడాలి

## కలెక్టర్ చక్రధర్‌బాబు



జిల్లాలో పంటల సాగుకు బ్యాంకులు తమవంతు సహకారం అందించాలని, రైతులకు మేలు జరిగేలా బ్యాంకు రుణ పరిమితులు నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు బ్యాంకు అధికారులకు సూచించారు. మంగళవారం నెల్లూరులోని కలెక్టర్‌బంగ్లాలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జలవనరులు పుష్కలంగా ఉన్నాయని, పంటలు సాగుచేసుకునేందుకు రైతులకు ఉదారంగా రుణాలివ్వాలని కలెక్టర్ ఆదేశించారు. డిసిసిబి సిఇఓ డా. శంకర్‌బాబు, జిఎం సరిత, డిజిఎం దయాకర్‌రెడ్డి, ఎల్‌డిఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, డిసిఓ తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్మికుల పట్ల.. నిర్లక్ష్యం తగదు

## - యూనియన్ నాయకుడు ఉమమహేశ్వరరావు -



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిసిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంతో ఉన్నాయని, ప్రజల కోసం పనిచేసే కార్మికుల పట్ల అలక్ష్యం తగదని మునిసిపల్ వర్కర్స్-ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు అన్నారు. మంగళవారం నెల్లూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన ఆ యూనియన్ ద్వితీయ మహాసభల్లో ఆయన మాట్లాడారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సిపిఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, అల్లాడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# నడకతోనే మంచి ఆరోగ్యం



నడక ఆరోగ్యానికెంతో మంచిదని, ఉదయం-సాయంత్రం కొద్దిసేపు నడకతో ఎన్నో రకాల వ్యాధులు బాధలు దూరం చేసుకోవచ్చని వాకర్స్ సంఘం ప్రతినిధులు చెప్పారు. నెల్లూరులో ఇటీవల 10వ 'వాకర్స్ మ్యాగజైన్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడారు. 50ఏళ్ల పైబడినవారు వాకింగ్ చేస్తున్నారని, వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరూ వాకింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 24, 25 తేదీల్లో నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో 31వ వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి అన్ని వాకర్స్ క్లబ్‌ల నుంచి వాకర్ మిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ కోశాధికారి ఎన్.బలరామయ్యనాయుడు కోరారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి గూడూరు లక్ష్మణకుమార్‌రెడ్డి, రీజనల్ కౌన్సిలర్-6 ఎస్.రాఘవేంద్రశెట్టి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డి, జిల్లా గవర్నర్ ఎలక్ట్ ఎం.వెంకటాద్రిరెడ్డి, మ్యాగజైన్ ఎడిటర్ వాకర్ వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# టౌన్‌హాలులో.. 'గురుచరిత్ర' ప్రవచనం

నెల్లూరులోని శ్రీ సాయి భరద్వాజ సత్సంగ బృందం ఆధ్వర్యంలో నవంబరు 30 నుంచి డిసెంబరు 6వ తేది వరకు నెల్లూరు టౌన్‌హాల్‌లో 'గురుచరిత్ర' దశమ ప్రవచన మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆ బృందం వారు తెలిపారు. దత్తజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8.30 గంటల దాకా గురుదేవులు ఎక్కిరాల భరద్వాజ పుత్రిక ఆడిదం వేదవతి 'గురుచరిత్ర' విశిష్టతను ప్రవచిస్తారని వారు పేర్కొన్నారు.

# దూసుకుపోయిన.. 'రామబాణం'

- పిఎస్ఎల్వి-సి 54 ప్రయోగం జయప్రదం
- ఓషన్ శాట్‌తో సహా..9 ఉపగ్రహాలు కక్ష్యలోకి
- రోదసిలో ఇస్రో మరో ఘనవిజయం

***అందరూ అనుకున్నట్లుగానే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో అద్భుత విజయం సాధించింది. విజయసాధనలో మేటిగా రాణిస్తూ..శాస్త్రవేత్తలు ఎంతగానో విశ్వసించే.. పిఎస్ఎల్వి సీరిస్ రాకెట్ 'రామబాణం'లా రివ్వుమంటూ నింగిలోకి దూసుకుపోయి తన నమ్మకాన్ని మరోసారి నిలబెట్టుకుంది. దీంతో షార్ శాస్త్రవేత్తల్లో ఉత్సాహం రెట్టింపైంది. శ్రీహరికోటలోని షార్‌లో ఉన్న మొదటి ప్రయోగవేదిక మీద నుంచి నవంబర్ 26వ తేదీ ఉదయం 11.56 గంటలకు ఈ ప్రయోగం జరిగింది. ఇస్రో ఛైర్మెన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలంతా కలసి పిఎస్ఎల్వి-సి 54 రాకెట్‌తో పాటు అంతరిక్ష కక్ష్యలోకి పంపిన 9 ఉపగ్రహాలు నిర్దేశిత కక్ష్యలోకి చేరడంతో షార్‌లో ఆనందం తొణికిసలాడింది. అందులోనూ ముఖ్యమైన ఓషన్ శాట్‌తో సహా అన్ని ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యకు చేరుకుని ప్రయోగం విజయవంతం కావడంతో భారతీయులంతా 'జయహో' అంటూ ఇస్రో శాస్త్రవేత్తల అభినందిస్తున్నారు.***





ఇస్రో శాస్త్రవేత్తలు తమ ప్రతిభాపాటవాలను మరోసారి నిరూపించుకున్నారు. పిఎస్ఎల్వి-సి54 రాకెట్ ప్రయోగాన్ని అన్ని దశల్లోనూ అత్యద్భుతంగా నిర్వహించి, అనుకున్నట్లుగానే ఉపగ్రహాలన్నిటినీ నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. అందులో మరీ ముఖ్యమైనది ఓషన్ శాట్. భూ వాతావరణ పరిశీలనకు, సముద్రాల శోధనకు ఓషన్ శాట్ (ఇఓఎస్-06) పెట్టింది పేరు. ఓషన్‌శాట్ శ్రేణిలో ఇది మూడోతరం ఉపగ్రహం. సముద్రాల్లోని మత్స్య సంపదను అత్యంత కచ్చితత్వంతో గుర్తించడంలో దీనికిదే సాటి. అందుకే మత్స్యకారులకు ఇది గణనీయమైన మేలు చేస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాక, ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ పొందేందుకు వీలుగా ముందస్తు సమాచారం అందించడంలోనూ ఓషన్‌శాట్ ఎంతోకీలకంగా పనిచేస్తుంది. తుఫానుల రాకను కూడా ముందే పసికడుతుంది. ఈ ప్రయోగం కోసం శాస్త్రవేత్తలు 15 కిలోల బరువున్న ఓషన్ శాట్‌లో గతంలో కంటే ఎంతో మెరుగైన పేలోడ్‌లను ఉంచి ప్రయోగించారు. భూమికి 742 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న సోలార్ సింక్రొనస్ కక్ష్యలోకి ఈ ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు కేవలం 17.17 నిమిషాల వ్యవధిలోనే విజయవంతంగా ప్రవేశపెట్టడం విశేషం.

## ఉపగ్రహాలన్నీ నిర్ణీత కక్ష్యలోకి

ఓషన్ శాట్‌తో పాటు ఈ ప్రయోగంలో 8 నానో ఉపగ్రహాలను కూడా ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ణీత కక్ష్యలోకి జయప్రదంగా ప్రవేశపెట్టారు. ఓషన్ శాట్ విడిపోయిన అనంతరం, నాలుగు దశల్లో రాకెట్ దిశ మార్చుకుని మిగిలిన ఉపగ్రహాలు ఒకదాని తర్వాత మరొకటిగా విడిపోయి, నిర్ణీత కక్ష్యలోకి చేరే అతి క్లిష్టమైన ప్రక్రియను భారత శాస్త్రవేత్తలు నిర్విఘ్నంగా నిర్వహించి అందరి ప్రశంసలందుకున్నారు. మొత్తం ఈ ప్రయోగం అంతా 2 గంటలా 5 నిమిషాల వ్యవధిలో ఉత్కంఠభరితంగా సాగింది. మొదటగా ధృవ స్పేస్ వారు రూపొందించిన అతిచిన్న ఉపగ్రహం 'థైబోల్ట్' భూమికి 516 కిలోమీటర్ల దూరంలోని సూర్యానువర్తన ధృవ కక్ష్యలోకి ప్రవేశించింది. ఆ తర్వాత యుఎస్ఏ స్పేస్ ఫ్లైట్ వారు తయారుచేసిన నాలుగు ఆస్ట్రోక్రాస్ట్ ఉపగ్రహాలు ఒకదాని వెంట మరొకటిగా వరుసగా కక్ష్యలోకి చేరుకున్నాయి. వాటి తర్వాత ఫిక్సెల్ ఇండియా వారు రూపొందించిన 'ఆనంద్' ఉపగ్రహం, వెనువెంటనే భూటాన్-ఇండియా సంయుక్తంగా రూపొందించిన 18.28 కిలోల బరువున్న ఐఎన్ఎస్ 2-బి 'భూటాన్‌శాట్' నిర్దేశిత కక్ష్యలోకి సురక్షితంగా చేరుకోవడంతో ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతమైంది. ఆసియా దేశాల్లో భారత్‌కు అతి దగ్గరగా ఉన్న భూటాన్ దేశంతో సన్నిహిత సంబంధాలు ఈ ఉపగ్రహ విజయంతో మరింత బలపడ్డాయి కూడా. ఈ విజయాలతో షార్ శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. భారత అంతరిక్ష ప్రయోగాల్లో ఇది మరో మైలురాయిని అధిగమించింది. దీంతో ఇస్రో ఇప్పటికి 385 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టి గణనీయమైన వాణిజ్యలాభాలను ఆర్జించింది. అందులో పిఎస్ఎల్వి సీరీస్ రాకెట్ల ద్వారా పంపిన ఉపగ్రహాలు 349 దాకా ఉండి, అవన్నీ విజయవంతంగా కక్ష్యకు చేరడం భారత అంతరిక్ష శాస్త్రవేత్తల ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. భారత ప్రధాని నరేంద్రమోడీతో పాటు, విదేశాంగమంత్రి జైశంకర్ తదితర ప్రముఖులంతా ఈ ప్రయోగవిజయాన్ని ఎంతగానో ప్రశంసించి, శాస్త్రవేత్తలను అభినందించారు కూడా.

## శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు



పిఎస్ఎల్వి-సి 54 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అధ్యక్షులు కె.సోమనాథ్‌కు, షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్‌కు, షార్ శాస్త్రవేత్తలకు, ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. పిఎస్ఎల్వి ప్రయోగాల పరంపరలో ఈ 56వ ప్రయోగాన్ని కూడా అత్యంత సమర్ధవంతగా ఇస్రో నిర్వహించడం శ్లాఘనీయమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

### వైకాపా పాలనలో..

# ఆక్వా రైతుల విలవిల

## సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

### - 'ఇదేం ఖర్మ' అంటూ.. సోమిరెడ్డి ఆందోళన



వైకాపా పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల చిల్లకూరులో జాతీయరహదారిపై నిర్వహించిన 'ఆక్వా రైతులకు ఇదేం ఖర్మ' నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వారంగ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆక్వా రంగం కుదేలైపోయిందన్నారు. 2003లో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో ఆక్వా విద్యుత్ చార్జీలను యూనిట్ రూ. 1.75గా నిర్ణయించడం జరిగిందని, అప్పట్లో ఆక్వా రైతుల అసోసియేషన్ నేతల విన్నపం మేరకు 90 పైసలకు తగ్గించామని, రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల్లో ఆ 90 పైసలను ఏకంగా రూ. 4కి పైగా పెంచేశారని ఆయన పేర్కొన్నారు. 2014లో మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఎలాంటి షరతులు లేకుండా దానిని రూ. 2కి తగ్గించామని, ఎన్నికలకు ముందు ఓట్ల కోసం బాదుడే బాదుడు... అంటూ హడావుడి చేసిన జగన్మోహన్‌రెడ్డి రూ. 1.50కి తగ్గిస్తామన్నారని, అయితే రూ. 1.50కి తగ్గించినప్పటికీ జోన్, నాన్ జోన్, హార్స్‌పవర్ల పేరుతో ఆక్వా రైతుల కొంప ముంచేశారని ఆయన దుయ్యబట్టారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ల బిగింపులోనూ అక్రమాలేనని, సొంత కంపెనీలకు ఆ కాంట్రాక్టులు ఇచ్చి భారాన్ని రైతులపై నెట్టేస్తున్నారని విమర్శించారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రూ. 1.50కే ఆక్వా రైతులకు విద్యుత్ ఇస్తామని ఆయన భరోసా ఇచ్చారు. జిల్లాలో వైకాపా నేతలు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి కోట్లకు కోట్లు ఎగ్గొట్టినా ఈ నాయకులకు పట్టడం లేదని, దేశంలోని ఆక్వా ఎగుమతుల్లో 60 శాతం ఏపీ నుంచి జరుగుతుండటంతో ఆక్వా రంగంపై జగనన్న కన్నుపడిందని, సీడ్, ఫీడ్ చట్టాలు, బొజ్జలు నిండిన మంత్రులతో కమిటీలు వేసి రైతుల వెన్ను విరిచేశారని విమర్శించారు. ప్రజాసమస్యలపై నోరు విప్పినా ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోండడం దారుణమని ఆయన అన్నారు. జాతీయరహదారిపై పెద్దఎత్తున జరిగిన ఈ ఆందోళనలో టిడిపి నాయకులు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్, నరసింహయాదవ్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకష్ణ, కంచర్ల శ్రీకాంత్, బొమ్మి సురేంద్ర, రావూరు రాధాకృష్ణమనాయుడు, వేనాటి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిందుమీనన్‌కు..ఆర్యవైశ్య సంఘం సత్కారం



నెల్లూరులోని ప్రముఖ వైద్యురాలు బిందుమీనన్‌ను నవంబరు 27న నెల్లూరులోని ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ వ్యాధులపట్ల ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు తమకు వచ్చే ఆరోగ్యసమస్యల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించి తగు చికిత్సలు చేసుకోవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్‌రావు, కృష్ణమూర్తి, కోశాధికారి సుబ్బారావు, దర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.







# శ్రీసిటీని సందర్శించిన 'ఎఫ్‌యుఇఎల్' బృందం

## నైపుణ్యాభివృద్ధి ప్రైవేట్ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై పరిశీలన




ఫ్రెండ్స్ యూనియన్ ఫర్ ఎనర్జైజింగ్ లైవ్స్(ఎఫ్‌యుఇఎల్) అనే స్వచ్ఛంధ సంస్థకు చెందిన ముగ్గురు ప్రతినిధుల బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీలో నైపుణ్యాభివృద్ధి ప్రైవేట్ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై పరిశీలనలు చేసింది. ఆ సంస్థ వ్యవస్థాపకులు, సీఇఓ కేతన్ దేశ్‌పాండే నేతృత్వంలో సంస్థ చీఫ్ మెంటర్ సంతోష్ హురళికొప్పి, ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ బాజీప్రభు దేశ్‌పాండే పాల్గొని శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను, ప్రస్తుత పురోగతి, కార్పొరేట్ సామాజిక బాధ్యత మరియు నైపుణ్యాభివృద్ధికి శ్రీసిటీ చేపట్టిన కార్యక్రమాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా కేతన్ దేశ్‌పాండే మాట్లాడుతూ 'ఎఫ్‌యుఇఎల్' స్థాపన, లక్ష్యాల గురించి తెలియజేశారు. వివిధ దేశాలకు చెందిన 200 పరిశ్రమలకు నిలయమైన శ్రీసిటీని చూడడంతో పాటు, వివిధ పరిశ్రమల కార్పొరేట్ సామాజిక బాధ్యత భాగస్వామ్యంతో ఇక్కడ నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయాన్ని స్థాపించే అవకాశాలను పరిశీలించడం తమ పర్యటన ముఖ్య ఉద్దేశ్యంగా ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత యూనివర్శిటీ గురించి వివరించిన సంతోష్ హురాలి కొప్పి, ఈ యూనివర్శిటీ మోడల్ జర్మన్ కోఆపరేటివ్ యూనివర్శిటీపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇందులో విద్యార్థులు 50 శాతం సమయం పరిశ్రమ భాగస్వామ్యంతో ప్రాక్టికల్ విద్యకు కేటాయించగా, మిగిలిన 50 శాతం అకడమిక్ పాఠ్యాంశాల బోధనకు కేటాయింపు ఉంటుందన్నారు. ఉద్యోగ నైపుణ్య శిక్షణతో పాటు విద్యార్థులందరికీ ఉద్యోగాల కల్పనకు కూడా సహకారం ఉంటుందని తెలిపారు. శ్రీసిటీలోని క్రియా యూనివర్శిటీని సందర్శించి వైస్ ఛాన్సలర్ ప్రొ.నిర్మలారావుతో కూడా వారు చర్చించారు. ఆ సంస్థ ప్రతిపాదనపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో స్పందిస్తూ, రాష్ట్రంలోని యువతకు, ముఖ్యంగా గ్రామీణ యువతకు ఇదొక మంచి అవకాశమన్నారు. యువత నైపుణ్యాలకు మెరుగు పెట్టడం ద్వారా ఈ ప్రాంత స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.

# తడ ఐటిఐకి 'ఐమాప్' పరిశ్రమ వితరణ



శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్(ఐమాప్) పరిశ్రమ వితరణతో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామి సహకారంతో ఇటీవల తడ ఐటిఐ భవనానికి కొత్త వెలుగులు వచ్చాయి. గతంలో ఆ కళాశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న నాలుగు గదుల భవనాన్ని(వెల్డింగ్ గదితో సహా) తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఆ పరిశ్రమ వారు 14 లక్షల రూపాయలు వెచ్చించి అత్యంత అధునాతన భవనంగా తీర్చిదిద్దారు. తరగతి గదుల్లో ఫర్నిచర్, ఇతర ల్యాబ్ పరికరాలను కూడా మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐమాప్ ప్రతినిధులు, ఉద్యోగులు, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, తడ ఐటిఐ అధ్యాపక బృందం, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు. 'ఐమాప్' పరిశ్రమ యాజమాన్యానికి తడ ఐటిఐ ప్రిన్సిపాల్ దేవదానం కృతజ్ఞతలు చెబుతూ, తమ కళాశాలతో పాటు ఈ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల మౌళిక వసతుల అభివృద్ధికి చొరవ చూపుతున్న శ్రీసిటీ ఫౌండేషన్ పనితీరును ప్రశంసించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో 'ఐమాప్' సీఎస్సార్ చర్యలను అభినందించారు. శ్రీసిటీ ప్రాంతంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనకు 'ఐమాప్' సంస్థ తమ సీఎస్సార్ కార్యక్రమాల్లో భాగంగా గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో 77 లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

# అక్రమాలు..అన్యాయాలపై ఉద్యమిద్దాం..రండి!

## ➤ పార్టీశ్రేణులకు టిడిపి నేతలు సోమిరెడ్డి, బీద రవిచంద్రల పిలుపు








రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక పాలనపై, అక్రమాలు–అన్యాయాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు అందరూ సంసిద్ధం కావాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పిలుపునిచ్చారు. కావలిలోని ఎంజిఆర్ కల్యాణమండపంలో టిడిపి ఆధ్వర్యంలో నవంబరు 29న పెద్దఎత్తున జరిగిన 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో వారు మాట్లాడారు.

రోజురోజుకీ వైకాపా దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, అదేమని అడిగితే అక్రమకేసులు బనాయిస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వైకాపా పాలనలో ధరలు పెరిగిపోయి సామాన్యప్రజలు బతకలేకపోతున్నారని, రైతులకు సంక్షేమం అన్నదే లేకుండా పోయిందని, ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలు తాండవిస్తున్నాయని వారు దుయ్యబట్టారు. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకుని అవినీతి అధికారుల భరతం పట్టాలని సూచించారు. ఇంటింటికీ వెళ్ళి వైకాపా అరాచకాలను ప్రజలకు తెలియజెప్పాలని, వైకాపాను గద్దె దించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. టిడిపి పాలనలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని, చంద్రబాబు నాయుడును తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని కోరారు. అందరం కలిసి కష్టపడితేనే విజయం సాధ్యమవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కావలి టిడిపి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు అధ్యక్షత వహించగా, కందుకూరు టిడిపి ఇన్‌చార్జి ఇంటూరు నాగేశ్వరరావు, టిడిపి నాయకురాళ్ళు తాళ్లపాక అనూరాధ, పోతుగుంటి అలేఖ్య, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబుయాదవ్, మాజీ ఎమ్మెల్యే కంభంపాటి విజయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ట్రేడ్‌ఫెయిర్‌లో ఘనంగా ఏపీ డే వేడుకలు



ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరుగుతున్న 41వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్‌ఫెయిర్‌లో గత నెల26న 'ఆంధ్రప్రదేశ్ డే' వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నవరత్నాలు' పథకాలను ఆవిష్కరించేలా రూపొందించిన ప్రత్యేక నృత్యరూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీంతోపాటు యామినీరెడ్డి బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించగా, విజయ్ డోలు నృత్యాలతో అలరించారు. డా. బిందుబినయ్ 'దశావతారాలు' నృత్య రూపకం కూడా విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేకమైన వీరనాట్యం, తప్పెటగుళ్ళు, రెండు తలల ఆట, డప్పు నృత్యం, గరగన్నృత్యం, స్ప్రింగ్ డ్యాన్స్ వంటి కళారూపాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథులు తొలుత ప్రగతి మైదానంలోని ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను సందర్శించి, అక్కడనుండి డప్పు వాయిద్యాల మధ్య కళాకారులతో కలసి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం చేరుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ఐఐసీ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ కనుమూరు రవిచంద్రారెడ్డి, ఏపి హెచ్‌టిసి ఛైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి, ఏపిఐడిసి ఛైర్మన్ బండి శివశక్తి నాగేంద్ర పుణ్యశీల, ఏపి మారిటైం బోర్డు ఛైర్మన్ కె.వెంకటరెడ్డి, ఏపి ఎంఎస్‌ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వంకా రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షుకౌశిక్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు భవన్ అధికారులు, సిబ్బంది, ఢిల్లీలో నివసిస్తున్న పలువురు తెలుగు ప్రజలు హాజరయ్యారు.

# వైకాపా పరిశీలకుల నియామకం





నెల్లూరు సిటీ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పరిశీలకులుగా ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులుగా కోడూరు కల్పలతలను నియమిస్తూ రాష్ట్ర వైకాపా అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీని పటిష్టపరిచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# ఏపీఎన్‌జిఓ గూడూరు అధ్యక్షునిగా శ్రావణ్



జిల్లా ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఆదేశాల మేరకు ఇటీవల గూడూరు ఎన్జీఓ హోమ్‌లో గూడూరు ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జి.రమేష్‌బాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా గూడూరు ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎస్.వి.శ్రావణ్‌కుమార్, సెక్రటరీగా తనూజ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.నాగరాజకుమార్, కోశాధికారిగా పి.అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గసభ్యుల చేత రమేష్‌బాబు ప్రమాణస్వీకారం చేయించారు.

## నెల్లూరు సిటీ సంయుక్త కార్యదర్శిగా వేగూరు



జనవిజ్ఞాన వేదిక అంటే గూడూరు, గూడూరు అంటే జనవిజ్ఞాన వేదిక అన్న విధంగా తనదైన శైలిలో సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న గూడూరుకు చెందిన వేగూరు రాజేంద్రప్రసాద్ నెల్లూరు సిటీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న వేగూరు రాజేంద్రప్రసాద్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

# సేవ చేయడంలో ముందుండాలి



పేదలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి తెలిపారు. గూడూరులోని డివిఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల పేద దివ్యాంగులకు పలసరుకులను అందజేశారు. ప్రతినిధులు శ్రీకంఠి రామ్మోహన్‌రావు, ఎన్.ఎస్.రెడ్డి, సిద్దారెడ్డి, సుబ్రహ్మణ్యం, సేగు శ్రీనివాసులు, తాళ్ళూరు శ్రీనివాసులు, బలరామిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



# డా.అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

**- మంత్రి కాకాణి**

భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగదినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 26న స్థానిక విక్రమసింహపురి యూనివర్శిటీలో కామన్‌పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన 'భారత రాజ్యాంగ నిర్మాణం–ప్రజాస్వామ్య వ్యవస్థ' అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సువిశాలమైన మనదేశానికి సుస్థిరమైన రాజ్యాంగాన్ని అందించిన మహామేధావి డా.అంబేద్కర్ అని ప్రశంసించారు. భారతావనికి రాజ్యాంగమే దిక్సూచి అని, ప్రతిఒక్కరూ డా. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అర్ధంచేసుకుని ఆచరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి మాట్లాడుతూ, ప్రపంచానికే ఆదర్శంగా మన రాజ్యాంగాన్ని రూపొందించారంటూ డా.అంబేద్కర్ ఘనతను కొనియాడారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి.రామచంద్రారెడ్డి, కామన్‌పీపుల్ ఫౌండేషన్ ఛైర్మెన్ దేవదాస్, సెక్రటరీ మాల్యాద్రి, నెరసం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్, ఎంపిపి మందా కవిత, వైకాపా నాయకుడు మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

### రూరల్ డిఎస్పీగా..

## బాధ్యతలు చేపట్టిన వీరాంజనేయరెడ్డి



నెల్లూరు రూరల్ డిఎస్పీగా పి.వీరాంజనేయరెడ్డి నవంబరు 26న బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన నగరంలోని మూలపేటలో ఉన్న తమ కార్యాలయంలో మాట్లాడుతూ, గతంలో తాను నెల్లూరు జిల్లాలో పనిచేసివున్నందున తనకు ఈ జిల్లాపై అవగాహన ఉందని, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజలకు తమవంతు మెరుగైన సేవలందిస్తామని చెప్పారు. ప్రజలకు తాము 24 గంటలూ అందుబాటులో ఉంటామని, ఏ సమయంలోనైనా తనకు ఫోన్(94407 96317) చేయవచ్చన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ విజయారావును, ఏఎస్పీ హిమవతి, సెబ్ జేడీ శ్రీలక్ష్మిలను ఆయన గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. వీరాంజనేయరెడ్డి 1989లో పోలీసుశాఖలో చేరారు. 2003లో సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. గతంలో నెల్లూరు నగర సిఐగా, ఏసిబీ సిఐగా కూడా పనిచేశారు. 2013లో డిఎస్పీగా పదోన్నతి పొంది, ఒంగోలు, విజయనగరం, నరసాపురంలలో డిఎస్పీగా పనిచేశారు. ఇప్పటిదాకా ఈ స్థానంలో నెల్లూరు రూరల్ డిఎస్పీగా ఉన్న హరినాథ్‌రెడ్డి టెక్కలికి బదిలీ అయ్యారు.

## బాధితుల సహాయకులను వేధించకండి

**డిఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్య**

ప్రమాదాల్లో గాయపడిన వారిని.. వెంటనే అడ్మిట్ చేసుకుని వైద్యం అందించాలని, బాధితులను ఆసుపత్రికి తీసుకువచ్చిన సహాయకులను గుర్తింపు కార్డులు చూపాలంటూ, కేసుల నమోదు పేరుతో వేధించకూడదని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పెంచలయ్య స్పష్టం చేశారు. ఇటీవల నెల్లూరులోని తమ కార్యాలయంలో రోడ్డుప్రమాదాల నివారణ గురించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాద బాధితులకు సాయం చేయడమన్నది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కొత్తచట్టం ప్రకారం.. బాధితులను ఆసుపత్రులకు తీసుకువచ్చినప్పుడు డాక్టర్లు బాధితునికి వెంటనే వైద్యం అందించకపోవడం నేరమని, బాధితులకు సహాయంగా వచ్చిన వారిని వేధింపులకు గురిచేయకూడదని హెచ్చరించారు. ప్రైవేటు ఆసు పత్రుల్లో జరిగే కాన్పులు, జనన–మరణ వివరాలను తప్పని సరిగా నమోదుచేయాలని ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రుల యాజ మాన్యాల వారితో పాటు, డెమో అధికారి శ్రీనివాసరావు, ఎస్‌ఓ సహన, కోఆర్డినేటర్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పరిశ్రమలకు పెద్దపీట

**కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు**



జిల్లాలో పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు స్థాపించాలనుకునేవారికి ప్రభుత్వపరంగా అన్నివిధాలా సహకారం అందిస్తున్నామని కలెక్టర్ ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన పరిశ్రమలు–ఎగుమతుల కమిటీ సమావేశంలో చెప్పారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 753 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 719 ఆమోదించామని, కొన్ని దరఖాస్తులను తిరస్కరించగా, మిగిలినవి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 9 మెగా పరిశ్రమలు, 30 పెద్ద పరిశ్రమలు, 4148 చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కమిటీ సమావేశానికి కొందరు అధికారులు రాకపోవడంపై కలెక్టర్ మండిపడుతూ, సంబంధిత అధికారులంతా ఇకపై తప్పనిసరిగా కమిటీ సమావేశాలకు హాజరుకావాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మారుతీప్రసాద్, డిపిఓ ధనలక్ష్మి, ఉపాధి కల్పన అధికారి సురేష్, కార్మికశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, జలవనరుల శాఖ ఎస్ఇ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## ఉద్యోగులు రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలి

జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులందరూ భారత రాజ్యాంగం స్ఫూర్తితో ప్రజలకు ఉన్నతమైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. నవంబరు 26న నెల్లూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా ప్రజాస్వామ్య నియమ నిబంధనల మేరకు పనిచేస్తామని ఉద్యోగులు, అధికారులచే ఆయన ఈ సందర్భంగా ప్రమాణం చేయించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుతూ, బాధ్యతగా పనిచేసి ప్రజలకు మంచి పాలన అందించాలన్నారు. రాజ్యాంగంలోని ప్రతి అక్షరం అందరికీ శిరోధార్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, డిపిఓ ధనలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ రంగవరప్రసాద్, డిసిఓ తిరుపాల్‌రెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురికి కారుణ్య నియామకాలు

జిల్లాలో సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తూ మరణించిన కుటుంబసభ్యులు ముగ్గురికి కలెక్టర్ ఉద్యోగాలిస్తూ ఆ ఉత్తర్వులను వారికి నేరుగా అందజేశారు. అందుకు సంబంధించిన అన్ని పత్రాలు సమర్పించిన ఖాసిం, వినాయక్, ప్రవీణ్‌కుమార్‌లకు ఉద్యోగాలిస్తూ ఉత్తర్వులిచ్చారు. నవంబరు 26న కలెక్టరేట్‌లోని తన ఛేంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కోవిడ్‌తోను, ప్రమాదాల్లోను మరణించిన ఆ ముగ్గురు ప్రొబేషన్‌లో ఉన్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి, వారికి ఉద్యోగాల కోసం విజ్ఞప్తిచేయగా, ప్రభుత్వం అందుకు సానుకూలంగా స్పందించి ప్రొబేషన్‌లో ఉన్నవారు మరణించినా వారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలివ్వాలని ఆదేశాలిచ్చిందని, అవి రాష్ట్రవ్యాప్తంగా అమలవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు..వస్త్రాల వితరణ



నెల్లూరులోని మదర్‌థెరిస్సా నిర్మల హృదయ్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నెల్లూరు జిల్లా వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నూతన వస్త్రాలను వితరణగా అందజేశారు. ఆ సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా సుమారు 20వేల రూపాయల విలువచేసే వస్త్రాలను వృద్ధులకు పంపిణీచేశారు. సంఘం అధ్యక్షులు కె.సుకుమార్‌రెడ్డి, కార్యదర్శి–విశ్రాంత డిసిటిఓ షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పెరుగు రామకృష్ణ, కోటేశ్వరరెడ్డి, చలపతి, మురుగేష్, సుందర్‌రాజారావు, శ్రీనివాసులు, హరిబాబు, రాజమహేశ్వరరాజు, నాగేశ్వరరావు, మొదలియార్, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్జీఓల సంఘానికి..కొత్త కార్యవర్గం

ఏపి ఎన్జీఓల సంఘం నెల్లూరు నగర శాఖకు ఇటీవల ఎన్నికలు జరిగాయి. కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షునిగా రామకృష్ణయ్య, కార్యదర్శిగా మార్కండేయులు, అసోసియేట్ అధ్యక్షురాలిగా స్వర్ణలత ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ఖాజారహంతుల్లా, శ్రీనివాసులుతో పాటు మిగిలిన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### కోవూరులో.. షిర్డీసాయికి పూలంగిసేవ

మార్గశిర మాసం పాడ్యమి పర్వదినం సందర్భంగా ఇటీవల కోవూరులోని జాతీయరహదారి వద్ద ఉన్న శ్రీ షిర్డీసాయి మందిరంలో సాయినాథునికి విశేషపూజలు చేశారు. ఆలయ అర్చకులు జగదీష్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకగా స్వామివారికి అభిషేకాలు, పూలంగిసేవ, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### తూర్పుకంభంపాడులో.. 'నాడు-నేడు' పనుల పరిశీలన

చేజర్ల మండలంలోని తూర్పుకంభంపాడులో ఇటీవల వెలుగు ఏపిఎం సుజన 'నాడు–నేడు' పనులను పరిశీలించారు. పాఠశాల సిబ్బంది, తల్లితండ్రుల కమిటీతో పనుల పురోగతిని సమీక్షించారు. నాణ్యతలో రాజీ పడకుండా, పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వారికి సూచించారు. హెడ్మాస్టర్ వెంకటరమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### రాజుపాళెంలో.. సిద్ధమ్మ తల్లికి పొంగళ్లు

మర్రిపాడు మండలంలోని రాజుపాళెం గ్రామంలో నవంబరు 27న సిద్ధమ్మతల్లికి గ్రామస్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వీరమ్మ ఆధ్వర్యంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### పల్లిపాడులో.. రక్తహీనతపై అవగాహన

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని దళితవాడలో ఉన్న పాఠశాలలో ఇటీవల ఆరోగ్యకార్యకర్తలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కలిగించారు. రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఏఎన్ఎం కమల, ఆశావర్కర్ రమ, ఉపాధ్యాయినులు మంజుల, రేవతి పాల్గొన్నారు.

### పంచేడులో.. పారిశుద్ధ్యం పనుల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఇఓపిఆర్‌డి వెంకటశ్యామ్ ఇటీవల పరిశీలించారు. బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడం వంటి పనుల్లో పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలిచ్చారు. పరిసరాల పరిశుభ్రత పట్ల, వ్యక్తిగత శుభ్రత పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని గ్రామస్తులకు సూచించారు.

### కావలిలో.. బాధితురాలికి 'సంయుక్త' సాయం

గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్న బంగారమ్మ అనే ఓ నిరుపేద వృద్ధురాలికి కావలిలోని 'సంయుక్త' సేవాసంస్థ వారు తమ సంస్థ సభ్యుల సహకారంతో ఇటీవల ఓ నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు దుప్పట్లు అందజేశారు. సంస్థ అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, సభ్యులు ఎం.అజిత్‌బాబు, నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణపల్లిలో.. రోడ్డుప్రమాదానికి 3 గేదెలు బలి

ఉదయగిరి–బద్వేల్ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నవంబరు 27వ తేది రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో మూడు గేదెలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. మరో గేదె తీవ్రగాయాలతో విషమపరిస్థితికి చేరుకుంది. ప్రమాదంలో గేదెలు మృతిచెందడం చూసి గ్రామస్తులు ఆవేదనకు గురయ్యారు.

### విశ్వనాథరావుపేటలో.. వీధి దీపాల అపహరణ

బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేటలో వెలుగుతున్న ఎల్ఇడి వీధిదీపాలను ఎవరో దొంగలు అపహరించుకుపోయారు. నవంబరు 26వ తేది రాత్రి ఈ చోరీ జరిగినట్లు సర్పంచ్ జి.మంజుల పేర్కొన్నారు. అసలే పంచాయతి ఆర్థిక అవస్తల్లో ఉంటే దొంగలు పదిమందికీ వెలుగునిచ్చే వీధి దీపాలపై కూడా కన్నేయడం దారుణమంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇక్కడ రాజపూజ్యం - అక్కడ అవమానం

(మొదటి పేజీ తరువాయి)

లోటస్ పాండ్‌లోని తమ నివాసానికి చేరుకున్న షర్మిల, సోమవారం ఉదయం తన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రగతి భవన్‌కి బయలుదేరింది "తాను ప్రశాంతంగా పాదయాత్ర చేసుకుంటుంటే, తనపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోకుండా తనను హైదరాబాదుకి తరలించడం ఎంతవరకు సబబు కేసీఆర్" అని ప్రశ్నించాలన్నది ఆమె ఉద్దేశ్యం.



పంజాగుట్ట సెంటర్లో పోలీసులు ఆమెను అడ్డుకోవడం, రెండు మూడు గంటల పాటు హైడ్రామా నడవడం, ఆమె కారులో కూర్చొని ఉండగానే ఆమె కారుని టోయింగ్ చేసి ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్‌కి తరలించడం జరిగాయి. అక్కడ ఆమెపైన మూడు సెక్షన్ల క్రింద కేసు నమోదుచేసి నాంపల్లి కోర్టుకి తరలించడం, అక్కడ ఆమెకు వ్యక్తిగత పూచీపై బెయిల్ లభించడంతో ఆరోజుకి కథ కంచికి, షర్మిల ఇంటికి చేరారు.

## ఇది ప్రభుత్వ విఫలం కాదా...?

నర్సంపేటలో షర్మిలపై దాడి ముందస్తు వ్యూహం ప్రకారమే జరిగిందని టీఆర్ఎస్ నాయకులే చర్చించుకుంటున్నారు. ఒక పార్టీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి కూతురు, పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరి అయినా షర్మిలపై దాడికి కుట్ర జరిగితే తెలంగాణ ఇంటిలిజెన్స్, పోలీస్ నిద్రపోతున్నారా...? దాడి జరిగిన పక్కరోజు దాడిలో ధ్వంసమైన కారులోనే తన లోటస్ పాండ్ నుండి ప్రగతి భవన్‌కి బయలుదేరిన షర్మిలని ఇంటి దగ్గరే ఎందుకు అడ్డుకోలేకపోయారు..? ఆ మాత్రం సమాచారం తెలంగాణ పోలీసుల దగ్గర లేదా..?? ముందురోజు తనపై అంత దాడి జరిగితే.. షర్మిల సైలెంటుగా ఉంటుందని నిఘా విభాగాలు ఎలా అనుకున్నాయి...??? ఇలా ప్రశ్నించుకుంటూపోతే ఇక్కడ షర్మిల ఉదంతంలో పూర్తి వైఫల్యం తెలంగాణ ప్రభుత్వ నిఘా విభాగానిది, పోలీసులది. షర్మిల సంఘటన తరువాత కూతుర్ని కలవడానికి పోలీస్‌స్టేషన్‌కి బయలుదేరిన విజయమ్మను మాత్రం పోలీసులు అడ్డుకున్నారు. ఆమె స్వయంగా ఆమరణదీక్షకు చేరేలా ఆమెను రెచ్చగొట్టారు. ఇక్కడ మాత్రం ముందస్తు సమాచారంతో లోటస్‌పాండ్‌లోనే విజయమ్మను ఆపేశారు. షర్మిల విషయంలో ఫెయిలైన ఖాకీలపైన మాత్రం తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

విశాఖ విమానాశ్రయంలో పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంలో చోటు చేసుకున్న సంఘటనలకు బాధ్యులను చేస్తూ ఆంధ్రా ప్రభుత్వం కొంతమంది అధికారులను వెంటనే సస్పెండ్ చేసింది. షర్మిల సంఘటనలో తెలంగాణ ప్రభుత్వం అలాంటి యాక్షన్ తీసుకున్న పాపాన పోలేదు.

## ఇది ఎవరి వ్యూహం...? సమాధానాలు దొరకని అనుమానాలు..!

ప్రభుత్వం కూడా ఒక పథకం ప్రకారమే షర్మిల విషయంలో వ్యవహరించిందా అన్న అనుమానాలు చాలామందిలో ఉన్నాయి. వ్యూహాత్మకంగా ఆమెను అవమానించడం, భయభ్రాంతులకు గురిచేసి ఆమె పాదయాత్రను అడ్డుకోవడం వారి ఉద్దేశ్యమని కొందరి అభిప్రాయం. అయితే, కేసీఆరే ఆమెకు ప్రచారం కల్పించి, కాంగ్రెస్ శ్రేణులు ఆమె పంచకు చేరేలా ప్రేరేపించి, తెలంగాణలో కాంగ్రెస్‌ని బలహీన పడేలా చేసి తాను లబ్ది పొందాలని చూస్తున్నాడని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. అదేమీకాదు, ఆమె వెనుక కమలనాథులు ఉన్నారన్న వాదన కూడా బలంగా వినపడుతోంది. వ్యూహం ఎవరిదైనా, పథకం ఏ పార్టీ రచించినా వీధులలో అవమాన పడుతుంది మాత్రం రాజన్న కుటుంబం. గతంలో జగన్ అరెస్టు అయిన తరుణంలో కూడా ఇదే హైదరాబాదు రోడ్లపై పడుకున్నారు వై.ఎస్. కుటుంబసభ్యులు. వై.ఎస్ మరణానంతరం అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ తెలంగాణలో ఆ కుటుంబానికి అవమానం జరుగుతూనే ఉంది.

ఆంధ్రా సి.ఎం జగన్‌మోహన్‌రెడ్డితో తనకు మంచి సంబంధాలున్నాయని చెప్తూనే తెలంగాణలో ఆయన చెల్లిని, తల్లిని అడ్డుకుంటున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్. ఇక్కడ జగన్‌మోహన్ రెడ్డి కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం కల్వకుంట్లతో కలిసే ప్రయాణం చేస్తామని చెప్తూనే, మరోవైపు కేసీఆర్ వ్యతిరేకిస్తున్న బీజేపీతో స్నేహసంబంధాలు నడుపుతున్నారు. జగన్, కేసీఆర్‌ల మధ్య స్నేహానికి సఖ్యతలేదని రెండుపార్టీల నాయకులు, అభిమానులు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. జగన్ కమలప్రియుడైతే, కేసీఆర్ కలహప్రియుడని... వీళ్లిద్దరికీ స్నేహంకుదిరే ప్రసక్తేలేదన్నది వారి ఆలోచన. అనాదాంధ్రలో జగన్‌కి ప్రజలు రాజయోగం కల్పిస్తే... పక్క రాష్ట్రంలో ఆయన తల్లికి, చెల్లికి ఘోర పరాభవాలు జరుగుతున్నాయి. రాజకీయాలను పక్కనపెడితే ఈ సంఘటనలు చూస్తున్న రాజశేఖరరెడ్డి ఆత్మీయుల హృదయాలు మాత్రం రోధిస్తున్నాయి. ఆ కుటుంబానికా ఈ దుస్థితి అని విచారిస్తున్నాయి..!

# యాచేంద్రకు.. ఆనం ఆత్మీయ పరామర్శ



వెంకటగిరి సంస్థానాధీశులు, ఇటీవల దివంగతులైన రాజా వెలుగోటి మదన గోపాలకృష్ణ యాచేంద్ర అకాల మరణం పట్ల మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. నవంబరు 28న వెంకటగిరిలోని రాజాగారి బంగ్లాకు వెళ్ళి..ఆయన కుటుంబసభ్యులు, ఎస్వీబిసి ఛైర్మన్..మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్రను ఆత్మీయంగా పరామర్శించారు.

# ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



## • 45 మందికి ఉద్యోగాలు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళశాలలో గుంటూరుకు చెందిన 'దెవలప్ ట్రీస్' అనే సాఫ్ట్‌వేర్ ప్రాడెక్ట్ సంస్థ ఇటీవల ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఆ కంపెనీ సిఇఓ దగ్గుబాటి శ్రావణ్ బృందం విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలకు ఎన్‌బికెఆర్ విద్యార్థులు 314 మంది హాజరయ్యారు. పరీక్షలు, ఇంటర్వ్యూలు పూర్తయిన అనంతరం 45 మంది విద్యార్థులు ఆ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనంగా 3.5 లక్షల రూపాయలు ఇవ్వనున్నారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్.కిషోంధర్, అధ్యాపకులు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# శ్రీకంటి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఆయన సతీమణి పి.ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ గురువారం గూడూరు తిలక్‌నగర్‌లోని మినీ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు సి.రోహిణి, గంగాధర్‌రెడ్డి, నారాయణ తదితరులు విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రొటేరియన్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, దశరథరామయ్య, వెస్ట్‌క్లబ్ అధ్యక్షులు ధనంజయరెడ్డి, ఎన్.ఎస్.రెడ్డి, డి.రవీంద్రనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, శేగు శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, నాశిన నాగులు తదితరులు పాల్గొన్నారు.

# చెస్‌లో చిన్నారుల ప్రతిభ



గుంటూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి చెస్‌పోటీల్లో బుచ్చిరెడ్డి పాళెంకు చెందిన హిమ తేజస్విని, నెల్లూరుకు చెందిన రిషి మనోహర్‌లు ప్రతిభతో రాణించడం పట్ల రాష్ట్ర చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మస్తాన్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఓపెన్‌టీం విభాగంలో రిషి మనోహర్ ప్రథమస్థానం సాధించగా, మహిళా విభాగంలో హిమ తేజస్విని ద్వితీయస్థానం సాధించింది. దీంతో వారిరువురిని బుచ్చిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శర్మ, కోశాధికారి జ్వాలాముఖి అభినందించారు.

# 4న స్విమ్మింగ్ ఎంపికలు

జిల్లాస్థాయి బాలబాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపికలు డిసెంబరు 4వ తేదీన నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఎస్ మధు, కె.సనత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10-17 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలు అర్హులని, ఆసక్తి కలిగిన వారు వయసు ధృవీకరణపత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

# కానిస్టేబుళ్లు.. హెడ్‌కానిస్టేబుళ్ళయ్యారు

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎనిమిది మంది కానిస్టేబుళ్ళకు హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఆమేరకు ఎస్పీ సిహెచ్ విజయారావు బుధవారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. బి.ప్రసాద్‌నాయుడు (మర్రిపాడు), వై.రవిరాజు (సిసిఎస్), జి.వేణుగోపాల్ (వేదాయపాళెం), ఎన్.పిచ్చిరెడ్డి (జలదంకి), ఎన్.వీరమోహన్ (మనుబోలు), బి.వెంగయ్య (సంగం), కె.లీలాకృష్ణ (రైల్వే), ఎం.మోహన్‌కృష్ణ (తిరుపతిజిల్లా-గూడూరు ఒన్‌టౌన్) ఈ ఉద్యోగోన్నతి పొందారు.

# పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

## - పబ్లిక్‌హెల్త్ నర్సింగ్ అధికారి మంజుల -

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, ఎప్పటికప్పుడు ఇ-ఆశ యాప్‌లో ఆ సమాచారాన్ని పంపాలని జిల్లా పబ్లిక్‌హెల్త్ నర్సింగ్ అధికారి మంజుల ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం నెల్లూరులోని కోటమిట్టలో ఉన్న పట్టణ ఆరోగ్యకేంద్రంలో పలుప్రాంతాల ఆశా వర్కర్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని చెప్పారు. తరచూ ప్రజలకు అర్థమయ్యేవిధంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి నరసింహారావు, డిసిఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌర్ణమికీ.. ప్రసన్న వేంకటేశ్వరునికి గరుడసేవ

బోగోలు మండలం కొండబిట్రగుంటలో కొలువైవున్న ప్రఖ్యాతమైన పుణ్యక్షేత్రం..శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఇకనుంచి ప్రతి పౌర్ణమికి స్వామివారికి గరుడసేవ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శ్రీరామమాల్యాద్రి, ఇఓ రాధాకృష్ణ చెప్పారు. డిసెంబరు 8వ తేదిన ఈ ఉత్సవాన్ని మంత్రి కాకాణి ప్రారంభిస్తారని, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్, దేవాదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ తదితరులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. స్వామివారికి గరుడ వాహనాన్ని దగదర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన భక్తులు అన్నం వెంకటరమణయ్య -పద్మావతి దంపతులు సమర్పించారని వారు వివరించారు.

# పవన్ రాజకీయం... గజిబిజి గందరగోళం!!



"ఏపీలో ఈరోజు ఎన్నికలు జరిగితే... ఎవరు గెలుస్తారంటావ్?"

ఆంధ్రాలో ఇప్పుడు ఏ ఇద్దరు కలిసినా... సంభాషణల్లో అనివార్యంగా ఈ ప్రశ్న వస్తోంది.

"ఇంకెవరు? వైసీపీయే..." జగన్ అభిమానులైతే.... ఇదీ సమాధానం.

"డౌటేంటి? టీడీపీయే..." అనేది వైసీపీ వ్యతిరేకుల సమాధానం.

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మాత్రం అంత స్పష్టంగా కనపడడం లేదు. వచ్చే ఎన్నికల్లో ఫలితం అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంది. ప్రభుత్వ నిర్వాహకుల వ్యవహారశైలి, అధికార యంత్రాంగం దృక్పధం, ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, డబ్బు... మద్యం, కులం, మతం, ప్రాంతం, ఓటర్ల వైఖరి... ఇన్ని కారణాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తుంటాయి.

వీటన్నిటికంటే ముందుగా... జనసేన వైఖరి తేలాల్సిన అవసరం కనబడుతోంది. 'రాజకీయం' అనే పులి మీద పవన్ కళ్యాణ్ స్వారీ చేస్తున్నారు. ఆ 'పులి'ని తన దారిలోకి తెచ్చుకోవడం ఎలాగన్న విషయమై ఆయనకే ఇంకా క్లారిటీ రావడం లేదన్న అభిప్రాయం రాష్ట్రంలో చాలామందికి కలుగుతోంది.

కొంత కాలం క్రితం, తన భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై స్పష్టతతో ఉన్నట్టే పవన్ కళ్యాణ్ కనిపించారు.

వైసీపీ వ్యతిరేక ఓటును ఎట్టి పరిస్థితుల్లోనూ చీలనివ్వబోమని శపథం చేస్తున్నారా అన్నంత స్థాయిలో గుప్పెట బిగించి మరీ మాట్లాడారు.

వైసీపీ విముక్త రాష్ట్రం దిశగా పని చేస్తున్నామని నాదెండ్ల మనోహర్ కూడా తెగేసి ప్రకటిస్తున్నారు.

దీంతో, టీడీపీతో కలిసి వెళ్ళడానికే జనసేన నిర్ణయించుకున్నదనే భావం రాష్ట్రంలో విస్తృతంగా ఏర్పడింది. వైసీపీని ఓడించాలి అని పవన్ భావిస్తుంటే... ఆయనకు ఉన్న ఏకైక దారి అదే. 'పని' అయినా... కాకపోయినా దారి మాత్రం ఇదే.

పవన్ ఈ దూకుడుతో, వైసీపీ నేతలు కూడా ఓ చిన్నపాటి కలవరానికి లోనయ్యారేమో తెలియదు కానీ.... ఆయనపై మాటల దాడి బాగా పెంచారు. వ్యక్తిగత దూషణలో కూడా కొత్త రికార్డు నెలకొలిపారు. పవన్ కళ్యాణ్ కూడా ఆ మాటల దాడులకు ధీటుగానే ప్రతిస్పందించారు. తన ప్రతిస్పందనలో ఆయనా చాలాదూరం వెళ్లారు. దీంతో, 'పొత్తు'లో టీడీపీకి అన్ని సీట్లు... జనసేనకు ఇన్ని సీట్లు అనే మాటలు కూడా రాజకీయ వర్గాలలో వినిపించాయి. అయితే, పానకంలో పుడక లాగా ఈ పొత్తుకు ఒక్కటే ప్రతిబంధకంగా కనిపించింది.

అదే బీజేపీ. టీడీపీతో జనసేన కలవడం బీజేపీకి అసలు ఇష్టం లేదు. బీజేపీని కాదని... టీడీపీతో ఎలా ముందుకు వెళ్లాలో పవన్ కళ్యాణ్‌కు అర్థం కావడం లేదు. పోనీ, టీడీపీని కాదని బీజేపీతో కలిసి, విడిగా వెళదామా అంటే... ఈ రెండు పార్టీలకు కలిపి 10 శాతం ఓట్లు కూడా లేవు. ఇక, వైసీపీని ఓడించేది ఎలా?

బీజేపీతో కలిసి విడిగా పోటీచేస్తే.. ఒకటి, రెండు సీట్లు కూడా గెలవలేని స్థితి. తాము సీట్లు గెలిస్తే ఏమిటి... గెలవకపోతే ఏమిటి... టీడీపీకి మాత్రం లాభం కలగకూడదనేది బీజేపీ వైఖరిగా కనపడుతోంది.

టీడీపీ వైపు పవన్ కళ్యాణ్ మొగ్గకుండా చూడాల్సిన 'అవసరాన్ని' బీజేపీ సుప్రీం కమాండర్ అయిన నరేంద్ర మోడీకి బీజేపీ నేతలు వివరించి ఉండాలి.

లేకపోతే, తన 'అధికారిక' విశాఖ టూర్‌లో... తనను కలవాలని పవన్‌కు మోడీ నుంచి కబురు వచ్చి ఉండేది కాదు. ఆయనకు ప్రభుత్వ కార్యక్రమాల కంటే... పార్టీ కార్యక్రమాలపైనే ప్రాధాన్యం ఎక్కువ.

ప్రధాని కార్యాలయం పిలుపుతో ప్రత్యేక విమానంలో పవన్ విశాఖ వెళ్లారు. ప్రధానిని కలిశారు.

బీజేపీతోనే పవన్ కళ్యాణ్ విడిగా ఎన్నికలకు వెళ్లాలని ప్రధాని... పవన్‌కు చెప్పి ఉంటారనేది పరిశీలకుల ఊహాగానం.

ప్రధానిని కలిసిన సంతోషం పవన్ మొహంలో కనిపించలేదని... ఆయన 'ప్రెస్‌మీట్'కు హాజరైన విలేకరులలో కొందరికి ఈ అభిప్రాయం కలిగింది. దీంతో, మళ్ళీ డైలమాలో పవన్ కళ్యాణ్ పడిపోయినట్టు వారు అంచనా వేశారు.

అసలు, ఒకటిన్నర శాతం ఓట్లు కూడా రాష్ట్రంలో లేని బీజేపీతో కలిసి వెళ్ళక తప్పని 'అనివార్యత' పవన్ కళ్యాణ్‌కు ఏమిటో అర్థం కాదు. క్షేత్రస్థాయిలో జనసేన - బీజేపీ మధ్య సఖ్యతే కనిపించదు. క్షేత్రస్థాయిలో జనసేన-టీడీపీ శ్రేణులే భుజాలపై చేతులు వేసుకు తిరుగుతున్నాయి.

బీజేపీతో పోల్చుకుంటే... జనసేనే దాదాపు ఎనిమిది, తొమ్మిది రెట్ల పెద్ద పార్టీ. కానీ బీజేపీయే జనసేనకు టర్మ్స్ డిక్టేట్ చేస్తున్న వాతావరణం రాష్ట్రంలో కనిపిస్తోంది. కుక్కే తోకను ఊపడం అనేది ప్రకృతి ధర్మం అనే నానుడి ఇక్కడ తిరగబడినట్టు కనబడుతోంది. బీజేపీ సభలు - సమావేశాలకు జనసేన వారిని పిలవరు. కనీసం జనసేన అనే పేరు కూడా ప్రస్తావించరు.

అలాగే, జనసేన సభలు - సమావేశాల్లో బీజేపీ పేరు ఎత్తరు. కానీ మిత్ర పక్షాలం అంటుంటారు. ఈ చిత్రమైన కన్ఫ్యూజన్ నుంచి పవన్ బైటపడి స్పష్టమైన రాజకీయ వైఖరి తీసుకుంటే గానీ... రాష్ట్రంలో రాజకీయం అర్థం కాదు.

అయితే, ఎన్నికలకు చాలా సమయం ఉంది. తక్కువలో తక్కువ కనీసం ఓ ఏడాది సమయం ఉంది. అందువల్ల జనసేన వైఖరి ఏమిటో ఇప్పుడే స్పష్టం చేయాల్సిన అవసరం ఏముందని కొందరు జనసేన ముఖ్యులు అంటున్నారు.

ఈలోపు జనంలో తన గ్రాఫ్‌ను ఎంతవరకు పెంచుకోడానికి వీలైతే అంత పెంచుకోవాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.

మొన్న ఆదివారం మంగళగిరిలో జరిగిన ఇప్పటం గ్రామస్థుల సభలో కూడా పవన్ కళ్యాణ్ ఇదే రకమైన రాజకీయ అయోమయాన్ని చాలా బలంగా ప్రదర్శించారు.

గతంలో ఎప్పుడూ లేనంత తీవ్రంగా దుమ్మెత్తి పోశారు. సజ్జల రామకృష్ణారెడ్డిని టార్గెట్ చేశారు. ఆయనను డీ-ఫాక్టో ముఖ్యమంత్రి అనడం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌ను కించపరిచే ప్రయత్నం చేశారు. 2024లో ఎలా మీరు గెలుస్తారో... మేము చూస్తాం సజ్జలా అన్నారు. తెరవెనుక ఉండే సజ్జలను తెర మీదకు పవన్ తీసుకువచ్చారు. ఆ విధంగా జగన్‌ను, వైసీపీని డ్యామేజ్ చేశారు.

అయితే, ఇదంతా బీజేపీతో కలిసి పోటీచేసి... వైసీపీని ఓడిస్తారా...., లేక టీడీపీతో కలిసి వైసీపీని ఓడిస్తారా అనే విషయం చెప్పలేదు. ఒకవేళ, టీడీపీతో వెళ్ళాల్సివస్తే... సముచితమైన రీతిలో సీట్లు డిమాండ్ చేయడానికి కూడా ఈ 'హడావుడి' చేస్తున్నారా అనేది తెలియదు.






అయితే... ఎన్నికల నాటికి, జనసేన తమతో కలవడం అనివార్యం అనే భావన మాత్రం టీడీపీ క్షేత్రస్థాయి శ్రేణులలో గట్టిగానే ఉంది. ఇటువంటి భావన మామూలు జనంలో కూడా బలంగానేఉంది.

బీజేపీతో టీడీపీకి ఒకే ఒక ప్రయోజనం ఉంది. వచ్చే ఎన్నికల్లో... తన కుర్చీ కింద బీజేపీ గోతులు తవ్వకుండా చూసుకోవడం అనేది టీడీపీకి అత్యావశ్యకం. అందుకోసమే కోసమే చంద్రబాబునాయుడు - మోడీ ప్రసన్నత కోసం ప్రయత్నిస్తున్నారు.

జనంలో టీడీపీ గ్రాఫ్ ఇటీవలి కాలంలో పెరుగుతుంది అనడంలో సందేహం అవసరం లేదని... ఇటీవల కర్నూలు జిల్లాలో మూడు రోజుల పాటు సాగిన చంద్రబాబు పర్యటన స్పష్టం చేస్తోంది. ఆ పర్యటనతో, చంద్రబాబుకు కూడా ఆత్మవిశ్వాసం పెరిగి ఉంటుంది. ఇప్పుడు టీడీపీకి కావలసింది నరేంద్ర మోడీ అభిమానం మాత్రమే. బీజేపీ ఓట్లు కాదు.

ఇక, సీపీఐకి ప్రత్యేకమైన స్టాండ్ ఏమీ ఉన్నట్టు లేదు, టీడీపీతో వెళ్లడం తప్పించి.

సీపీఎం అని మరో కమ్యూనిస్టు పార్టీ ఉంది.

రాజకీయంగా బీజేపీ... వారి ప్రథమ శత్రువు. దానితో కలిసి జనసేన వెళ్ళాలీ అనుకుంటే... సీపీఎంకు జనసేన ద్వితీయ శత్రువు. టీడీపీ తృతీయ శత్రువు. బహుశా, తోటి కమ్యూనిష్టు పార్టీ అయిన సీపీఐ కూడా వారికి చతుర్ధ శత్రువు అయితే అయి వుండవచ్చు. సీపీఎం శత్రువుల జాబితాలో వైసీపీ లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే... రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు అన్నీ సీపీఎం శత్రువుల హిట్ లిస్ట్‌లో ఉన్నాయి.

తమ పార్టీకి రాష్ట్రంలో ఎక్కడ ఉనికి ఉంటే... అక్కడ స్వతంత్రంగా పోటీ చేయాలనేది సీపీఎం వ్యూహం. సీట్లు గెలవడం... గెలవకపోవడం వారికి ముఖ్యమే కాదు.

ఇక, వైసీపీ విషయానికి వస్తే తక్కువలో తక్కువ 110 అసెంబ్లీ స్థానాలు, 16-17 లోకసభ స్థానాలు ఖాయమనే భావన ఆ పార్టీ నేతలు కొందరిలో వ్యక్తమవుతున్నది.

ఇవన్నీ అంచనాలు... ఊహాగానాలు.

ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఏ సమీకరణలు ఎలా మారతాయో తెలియదు.

అయితే, ఒకటి మాత్రం స్పష్టంగా చెప్పవచ్చు. అదే... ఏమి చేయాలనే విషయమై పవన్ కళ్యాణ్‌కు ఇంకా స్పష్టత లేదు అనే విషయం మాత్రం... స్పష్టంగానే కనిపిస్తోంది.

బీజేపీ వల్ల జనసేనకు రాజకీయ ప్రయోజనం ఏమీ కనిపించదు. రాజకీయేతర ప్రయోజనం ఏమైనా పవన్ కళ్యాణ్ ఆశిస్తుంటే ... అది ఏమిటో బయటకు తెలిసే అవకాశం లేదు. ఇక్కడ ఇంకో విచిత్రం కూడా ఉన్నది. పవన్ కళ్యాణ్ తో బీజేపీ మైత్రి ఒక్క ఏపీకే పరిమితం అంటున్నారు. తెలంగాణకు కాదని తెలంగాణ బీజేపీ నేతలు పదే పదే ప్రకటిస్తున్నారు. ఒకరకంగా, ఈ ప్రకటనల ద్వారా బీజేపీ నేతలు... పవన్ కళ్యాణ్ స్థాయిని తక్కువ చేసి మాట్లాడమే.

నిజానికి ఆయన అవసరం, బీజేపీకి ఆంధ్రలో కంటే... తెలంగాణలోనే ఎక్కువ ఉంది.

తెలంగాణలో ఈసారి అధికారంలోకి రావాలని బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర బీజేపీ పెద్దలు తెలంగాణపై ప్రత్యేక ఫోకస్‌పెట్టి పని చేస్తున్నారు. గుర్తింపు పొందిన బీజేపీ నాయకులు సైతం తెలంగాణలో గట్టిగానే ఉన్నారు.

ఈ పరిస్థితుల్లో... కనీసం 30, 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలను ప్రభావితం చేయగలిగిన ఏపీ వాసులు ఇక్కడ ఉన్నారు. వారిపై పవన్ కళ్యాణ్ ప్రభావం ఉండడానికి అవకాశం ఉంది. తెలంగాణ బీజేపీ పెద్దలు గానీ, కేంద్ర బీజేపీ పెద్దలు గానీ ఈ విషయం పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిజానికి తెలంగాణలో టీడీపీ ప్రభావం కూడా గణనీయమే. తెలుగుదేశంను సమర్ధించే బీసీ, కమ్మ సామాజిక వర్గాలు తెలంగాణ ఎన్నికల్లో గణనీయమైన పాత్ర పోషించే అవకాశం ఉంది. ఈ సమీకరణను బీజేపీ నేతలు ఎందుకు విస్మరిస్తున్నారో తెలియదు.

కానీ, ఒక్క అసెంబ్లీ స్థానం కూడా సొంతంగా గెలవడానికి అవకాశం లేని ఆంధ్రలో మాత్రం పొత్తు పేరుతో, పవన్ కళ్యాణ్ ముందరి కాళ్లకు బీజేపీ బంధం వేస్తోంది. బహుశా, టీడీపీపై అసహనంతో పవన్ కళ్యాణ్‌ను వెనక్కు లాగడం కోసమే...' జనసేన 'మా మిత్రపక్షం' అని అంటున్నారేమో కూడా తెలియదు.

పవన్ కళ్యాణ్‌కు ఇంకో ఇబ్బంది కూడా లేకపోలేదు.

వైసీపీ వ్యతిరేక ఓట్లు చీలనివ్వనని పదేపదే చెప్పి వైసీపీని నిశితంగా విమర్శిస్తూ, చివరికి బీజేపీతో కలిసి విడిగా పోటీ చేయక తప్పని అనివార్యతలోకి ఆయనను బీజేపీ బిగిస్తే 'పవన్ రాజకీయం'... జనంలో తేలిపోతుంది. అప్పుడు పవన్ కళ్యాణ్ ఆశలు పెట్టుకున్న ఓట్ బ్యాంకు అనుకునేది... టీడీపీకి మళ్ళవచ్చు. ఫలితంగా, ఆయన మళ్ళీ ఆరేడు శాతానికి పరిమితం అయినా కావచ్చు.

టీడీపీతో కలిసి పోటీచేసినా, విడిగా బీజేపీతో కలిసి పోటీచేసినా.... "ప్యాకేజి" ఆరోపణలు తప్పనిసరిగా వెల్లువెత్తుతాయి. టీడీపీతో కలిస్తే వైసీపీ దాని అనుకూల మీడియా నుంచి ఈ ప్యాకేజ్ ఆరోపణలు పెరుగుతాయి. సొంతంగా పోటీ చేస్తే... వైసీపీ నుంచి ప్యాకేజి అందిందని టీడీపీ, దాని అనుకూల మీడియా హోరెత్తిస్తాయి.

నిజానికి - టీడీపీ, జనసేన, బీజేపీ ఒక కూటమిగా ఏర్పడినంత మాత్రాన, వైసీపీని ఓడిస్తారనే గ్యారంటీ ఏమీ లేదు. జనసేన, బీజేపీ విడిగా పోటీచేసినా, ఆ రెండు పార్టీలకు ఒకటి... రెండు సీట్లకు మించి రాకపోయినప్పటికీ వైసీపీ ఓడిపోదు అని చెప్పడం కూడా కుదరదు. రెండూ ఊహాగానాలే.

కానీ పవన్ కళ్యాణ్‌కు తన రాజకీయ ప్రయాణం పై స్పష్టత ఉండాలి కదా!

ఆ స్పష్టత లేకపోవడం వల్లే 2019లో కూడా ఇలాగే జరిగింది. జనసేనకు ఓటు వేస్తే టీడీపీకి వేసినట్టేనన్న 'భయం'తో... తన 'సొంత' ఓట్ బ్యాంక్ అనుకున్నవారే వైసీపీకి పెద్దఎత్తున ఓటు వేశారు. ఈసారి ఇది రివర్స్ అయ్యే అవకాశాలను కొట్టి పారేయడానికి వీలు లేదు. జనసేన-బీజేపీకి ఓట్ వేస్తే, అది వైసీపీకి వేసినట్టే అన్న 'భయం'- వైసీపీ వ్యతిరేక జనంలోకి పాకిపోతే జనసేనకు 2019 ఫలితాలే పునరావృతం అవుతాయనే అంచనా కొందరు జనసేన నేతల్లో ఇప్పటికే అంతర్లీనంగా ఉంది . మీడియా విప్లవం వెల్లివిరుస్తున్న ఈ రోజులలో... నేతల హావాభావాలు కూడా ఓటర్ల మైండ్‌పై ప్రభావం చూపిస్తాయి.

టీడీపీతో కలిసి వెడితే, ఓ 15-20 మంది జనసేన ముఖ్యులు శాసన సభ మొహం చూసే అవకాశం ఉంటుంది, మొదటిసారి. బీజేపీతో కలిసి విడిగా ఎన్నికలకు వెడితే.... ఆశావహులైన జనసేన నాయకులు మళ్ళీ ఓ అయిదేళ్లు ఓపిక పట్టాలి, పవన్ కళ్యాణ్‌తో సహా. బీజేపీకి కొత్తగా పోయేది కానీ, వచ్చేది కానీ ఏమీ ఉండదు. మీడియా ప్రచారం ఫుల్లు.... ఓట్లు మాత్రం నిల్లు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com




## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో..

# అరుదైన వైద్యం

- **విజయవంతంగా హైపెక్ సర్జరీలు**

నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అధునాతన విధానాలతో సర్జరీలు విజయవంతంగా చేస్తున్నారు. ఇప్పుడు హెచ్ఐపిఇసి చికిత్స (క్యాన్సర్ సర్జరీ తర్వాత యంత్ర సహాయంతో పొట్టలో వేడిగా కీమోథెరపీ మందు ఇవ్వడం ద్వారా క్యాన్సర్ కణాలను నేరుగా నివారించే చికిత్స) ఈ ఆసుపత్రిలో అందుబాటులోకి రావడం విశేషం. ఇటీవలే ఇద్దరికి పూర్తిస్థాయిలో విజయవంతంగా చికిత్సలు అందించి వారి ప్రాణాలను కాపాడారు. క్యాన్సర్ ఆసుపత్రి సిఎంఓ డాక్టర్ టి.లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎం. నాగేశ్వరరావు, డాక్టర్ ఎం.రమేష్‌బాబు ఆ వివరాలు వెల్లడించారు. నెల్లూరు నగరానికి చెందిన ఇద్దరు మహిళలు క్యాన్సర్‌తో, పొట్టలో పెద్దగడ్డలతో బాధపడుతుంటే హైపెక్ యంత్రపరికరంతో విజయవంతంగా సర్జరీ నిర్వహించి, కీమో థెరపీ చేశామని, వారు త్వరగా కోలుకొని డిశ్చార్జి అయ్యారని చెప్పారు. అనస్థీషియా డాక్టర్ షరీఫ్ ఆధ్వర్యంలో, క్యాన్సర్ సర్జరీల నిపుణులు డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ ఎం.రమేష్‌బాబు, డాక్టర్ ఇ.శైలజ ఈ ఆపరేషన్లు నిర్వహించగా, డాక్టర్ తేజేశ్వర్ కీమోథెరపీ అందించారని వారు వివరించారు. సహకరించిన రేడియోథెరపీ డాక్టర్లు గీతా ఉషశ్రీ, డాక్టర్ లోకేశ్వరిలకు అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో క్యాన్సర్ ఆసుపత్రికి అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్ కుమార్‌జైన్, మ్యానేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, యడవల్లి సురేష్, మేనేజర్ (అడ్మిన్) ఎం.డి జుబేర్ పాల్గొన్నారు.

## మరువలేని మహానేత..

# మాగుంట సుబ్బరామరెడ్డి

### 27వ వర్ధంతి సందర్భంగా ఒంగోలు, నెల్లూరులలో ఘనమైన నివాళి

తన సేవాభావంతో ప్రజల గుండెల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్న మాగుంట సుబ్బరామరెడ్డిని ఏనాటికీ మరువలేమని, ఆ మహానేత భౌతికంగా లేకపోయినా... ఒంగోలు పార్లమెంటు సభ్యులుగా ఆయన ప్రజలకు చేసిన సేవలు శాశ్వతమని నాయకులు కొనియాడారు. డిసెంబరు1 గురువారం నాడు ఆ మహనీయుని 27వ వర్ధంతి కార్యక్రమం ఒంగోలులోని పివిఆర్ బాలుర మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరిగింది. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువనాయకులు మాగుంట రాఘవరెడ్డి, మాగుంట కుటుంబసభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో సుబ్బరామరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు మాగుంట సుబ్బరామరెడ్డి






సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంస్మరణ సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ మాగుంట సుబ్బరామరెడ్డి కాంగ్రెస్ పార్టీలో అగ్రనేత అయినప్పటికీ పార్టీలకు అతీతంగా ఆయన ప్రజలకు సేవలందించడంతో అన్ని పార్టీల నాయకులు ఆయనకు సన్నిహితంగా ఉండేవారని, అజాతశత్రువుగా పేరొందారని, ఒంగోలు ఎంపీగా ఆయన అటు ఒంగోలుజిల్లాకు, ఇటు స్వస్థలమైన నెల్లూరుజిల్లాకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించిన సహృదయ నేత మాగుంట సుబ్బరామిరెడ్డి అని, ఆయన లేని లోటు ఏనాటికీ తీరనిదని, తెలుగు ప్రజల గుండెల్లో ఆయన చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మల్లికా గార్గ్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బి.కృష్ణచైతన్య, బాలినేని ప్రణీత్, సుజాత, మహిధర్‌రెడ్డి, సిద్దా రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా.. నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ రాఘవ కళ్యాణ మండపంలో కూడా మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మాగుంట సుబ్బరామరెడ్డి జీవించి ఉండివుంటే నెల్లూరు నగరం దేశంలోనే అగ్రగామిగా ఉండేదని నివాళులర్పించిన నాయకులు, ప్రముఖులు ఆయనను గుర్తుచేసుకున్నారు.



1920 2018

4వ వర్ధంతి

మా ఇంటి దీపం.. ప్రేమానురాగాల ప్రతిరూపం

శ్రీ ఆదాల శంకరరెడ్డి గారు

పరమపదించి తేది.07.12.2022 నాటికి నాలుగేళ్ళు
గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు :
ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు, నెల్లూరు
ఆదాల మురళీకృష్ణారెడ్డి, ఛైర్మెన్, MAK గ్రూప్

కుమార్తెలు :
గునుపాటి శ్యామల
బిరుదవోలు జలజ

మనుమలు :
ఆదాల వంశీకృష్ణారెడ్డి
ఆదాల దామోదర్‌రెడ్డి


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com